# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:78 ఆదివారం 07 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## ఎన్నికల బరిలో ప్రజలే భాజపా అభ్యర్థులు

**బాదామి:**

బెంగళూరు రోడ్‌షోకు వచ్చిన స్పందన చూస్తుంటే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున పోటీ చేస్తున్నది ప్రజలేనన్న నమ్మకం కలిగిందని ప్రధాని మోదీ అన్నారు. ఇక్కడి ప్రజలు తనపై చూపించిన ప్రేమ, ఆప్యాయతలు ఇదివరకెన్నడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగళూరు రోడ్ షో ముగిసిన అనంతరం ప్రధాని మోదీ.. బగల్‌కోట్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇవాళ ఉదయం నేను ప్రజా దేవుళ్లను చూసేందుకు బెంగళూరు వెళ్లాను. అక్కడి ప్రజలు గతంలో నేను ఎన్నడూ కనీవినీ ఎరుగనంతగా ప్రేమాభిమానాలు చూపించారు." అని అన్నారు. రోడ్‌షో సాగిన 25 కిలోమీటర్ల మేర ఇసుక వేస్తే రాలనంత జనం.. భాజపాకి మద్దతుగా వచ్చారని తెలిపారు. ప్రజలంతా వాళ్ల కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా నిల్చొని స్వాగతం పలికారని అన్నారు. ఇందులో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, వికలాంగులు కూడా ఉన్నారని, వారందరి అభిమానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

" బెంగళూరులో పరిస్థితి చూసిన తర్వాత.. కర్ణాటకలో మోదీ పోటీ చేయడం లేదు. భాజపా నేతలు కూడా బరిలో దిగడం లేదు. కానీ, భాజపా తరఫున కర్ణాటక ప్రజలే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్న నమ్మకం కలిగింది." అని మోదీ అన్నారు. భాజపా సారథ్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఎలాంటి వివక్ష లేకుండా రాష్ట్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తోందని తెలిపారు. 85 శాతం కమిషన్ తీసుకునే రికార్డు తప్ప.. ప్రజలకు సేవ చేసే రికార్డు కాంగ్రెస్‌కు లేదని మోదీ ఎద్దేవా చేశారు. మరోవైపు పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో కర్ణాటకలో ఎన్నికల ప్రచారం వాడీవేడిగా సాగుతోంది. రోడ్ షోలు, బహిరంగ సభలు, సమావేశాలతో కన్నడ ప్రాంతమంతా బిబీబిజీగా ఉంది. మొత్తం 224 అసెంబ్లీ స్థానాలకు మే 10న పోలింగ్ నిర్వహించనున్నారు.

## కొనసాగుతున్న ఆపరేషన్ త్రినేత్ర



**శ్రీనగర్ :**

జమ్ముకశ్మీర్ లోని రాజోరిలో ఐదుగురు జవాన్లను హత్య చేసిన ఉగ్రవాదుల కోసం ఆర్మీ వేట ఉధృతమయ్యింది. ఇప్పటి వరకూ ఒక ఉగ్రవాది హతం కాగా? మరొకరికి తీవ్ర గాయాలు అయినట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రమూకల నుంచి ఆయుధాలు, మందుగుండును భద్రతా దళాలు స్వాధీనం

02



## బాధిత రైతులతో చంద్రబాబు భేటీ

**రామచంద్రాపురం**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ., డాక్టర్ బి. అర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజక వర్గంలో పర్యటించారు.పర్యటనలో భాగంగా అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి,

02

## అమర్ రాజా కంపెనీకి కేటీఆర్ భూమి పూజ

**హైదరాబాద్:**

మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. పర్యటనలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని దివిటిపల్లి వద్ద సుమారు 270 ఎకరాల్లో నిర్మిస్తున్న అమరరాజా లిథియం బ్యాటరీ కంపెనీకి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి గల్లా అరుణ, గల్లా జయదేవ్ తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్, బ్యాటరీ కంపెనీ ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్నారు. పరిశ్రమలకు ఊతం ఇస్తేనే ఉపాధి లభిస్తుందని, రాష్ట్రానికి సంపద వస్తుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని దివిటిపల్లి వద్ద సుమారు 270 ఎకరాల్లో నిర్మించనున్న అమరరాజా లిథియం అయాన్ బ్యాటరీ కంపెనీకి కేటీఆర్ భూమిపూజ చేశారు.



అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి గల్లా అరుణ, గల్లా జయదేవ్ తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్, బ్యాటరీ కంపెనీ ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్నారు. లిథియం అయాన్ బ్యాటరీ తయారీలో దేశంలోనే ఇది అతిపెద్ద పెట్టుబడి అని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో రూ.9,500 కోట్ల పెట్టుబడిని పెడుతున్నందుకు అమరరాజా గ్రూప్‌కు ధన్యవాదాలు తెలిపారు. తదేకమైన దీక్ష, పట్టుదలతోనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇదీ పోటీ ప్రపంచమని పోటీ

02

## ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదల

**72.26 శాతం మంది ఉత్తీర్ణత**

**బాలికలే పైచేయి.. బాలురు కంటే**

**అధికంగా 6.11 శాతం బాలికలు పాస్**

**జూన్ 2 నుంచి సప్లిమెంటరీ**

**విజయవాడ :**

ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 6,05,052 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలికలు 2,95,807

02




## ఘనంగా తిరుపతి గంగమ్మ జాతర

**తిరుపతి**

తిరుపతి గంగ జాతరకు ఘన చరిత్ర ఉంది. రాయలసీమలో జాతరలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నప్పటికీ... తిరుపతి జాతరకు మాత్రం ఎక్కడా లేనివిధంగా ప్రత్యేకతలు ఉన్నాయి. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని ఇటీవల పునర్ నిర్మించారు.. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తిరుపతి జాతరను రాష్ట్ర స్థాయి పండుగగా ప్రకటించింది. దీంతో గత ఐదు రోజులుగా

02



ప్రజాతపన
prajathapana.com

# కొనసాగుతున్న ఆపరేషన్ త్రినేత్ర

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నాయి. జమ్మూకశ్మీర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి ఆర్మీ ఆపరేషన్ త్రినేత్రను చేపట్టిన విషయం తెలిసిందే. ఇక రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా రాజోరి చేరుకున్నారు. ఉగ్రవాదుల ఏరివేత కోసం చేపట్టిన ఆపరేషన్ త్రినేత్రను ఆయన సమీక్షించారు. రాజోరి ఆర్మీ బేస్ క్యాంప్‌లో జవాన్లతో కేంద్ర మంత్రి భేటీ అయ్యారు. శుక్రవారం ఉగ్రవాదులు జరిపిన బాంబుదాడిలో ఐదుగురు జవాన్లు అమరులైన విషయం తెలిసిందే. వీర జవాన్లకు కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హాతో పాటు ఆర్మీ అధికారులు ఘననివాళి అర్పించారు. సరిహద్దు లోని రాజోరితో పాటు పూంచ్‌లో ఆర్మీతో పాటు బీఎస్ఎఫ్ బలగాలు భారీ కూంబింగ్‌ను చేపట్టాయి. గాలింపు చర్యల్లో హెలికాప్టర్లతో పాటు డ్రోన్లను కూడా ఉపయోగిస్తున్నారు. ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే కూడా రాజోరి చేరుకున్నారు. ఏప్రిల్ 20వ తేదీన కూడా ఆర్మీ కాన్వాయ్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు ఐదుగురు జవాన్లను హత్య చేశారు.

# బాధిత రైతులతో చంద్రబాబు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

రైతులతో మాట్లాడారు. అనంతరం టీడీపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఆదుకునే పరిస్థితి లేదని, కనీసం సీఎం గాని, మంత్రులు గాని వచ్చి పరామర్శించే పరిస్థితి లేక, రైతులు దిక్కులేని వారు అయ్యారన్నారు. కౌలు రైతులు ప్రస్తుత పంట నష్టంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఆంధ్రరాష్ట్రం ఆత్మహత్యల్లో ఊహించని స్థానానికి వెళుతుందన్నారు. రబీకి ప్రభుత్వం క్రాప్ ఇన్సూరెన్స్ కట్టలేదని చంద్రబాబు ఆరోపించారు. తడిచిన ధాన్యం ప్రభుత్వమే కొనాలని, రైతులకు మద్దతు ధర ఇచ్చి తీరాలని డిమాండ్ చేసారు. వైసీపీ రైతు వ్యతిరేక ప్రభుత్వమని, భయపెట్టి రాజ్యాలను ఏలలేరన్నారు. రైతులపై కేసులు పెడితే తాట తీస్తామని హెచ్చరించారు. కనీసం రైతులకు గోనె సంచులు ఇవ్వలేని అవినీతి ప్రభుత్వమం వైసీపీ అని విమర్శించారు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అహంభావంతో పాలిస్తోందన్నారు. రైతులకు క్వింటాలుకు 1500 ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులో కడ్తా పై మంత్రి సీరియస్

**నిజామాబాద్ :**

నిజామాబాద్ జిల్లాలో రైస్ మిల్లుల బాగోతంపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కడ్తా పేరుతో దోచుకుంటున్నారని రైతులు వేల్పూర్ లోని మంత్రి నివాసంలో గోడు వెళ్ల బోసుకున్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే.... జిల్లాలో కొన్ని రైస్ మిల్లులు కడ్తా పేరుతో రైతులను మోసం చేస్తుండటాన్ని మంత్రి వేముల సీరియస్ గా తీసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రైస్ మిల్లర్ల తీరును మంత్రికి వివరించారు. దీంతో రైస్ మిల్లర్ల వ్యవహారంపై మంత్రి సీరియస్ అయ్యారు. వెంటనే జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమతుకు ఫోన్ కాల్ చేశారు. జిల్లాలోని పలు రైస్ మిల్లులు ఆగడాలపై కలెక్టర్ కు వివరించారు. రైతులను నష్టపరిచే విధంగా రైస్ మిల్లులు కడ్తా పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని మంత్రి సూచించారు. జిల్లాలో మొత్తం 220 రైస్ మిల్లులకు అలాట్ మెంట్ ఇస్తే... అందులో 5 రైస్ మిల్లర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మంత్రి వేముల కలెక్టర్ కు వివరించారు. ప్రధానంగా జిల్లాలోని 5 రైస్ మిల్లులు (పద్మావతి రైస్ మిల్, కాపర్తి ఇండస్ట్రీస్, ఎల్ జీ ఆగ్రో, రుద్రా ఇండస్ట్రీస్, త్రివేణి రైస్ మిల్) కడ్తా పేరుతో రైతులను మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఐదు రైస్ మిల్లులో తక్షణమే పద్మావతి రైస్ మిల్లు అలాట్ మెంట్ నిలిపి వేయాలని ఈ ఏడాది బాన్ చేయాలని మంత్రి వేముల కలెక్టర్ కు ఆదేశించారు. మిగతా 4 రైస్ మిల్లర్లకు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. మరోసారి కడ్తా పేరుతో మోసం చేస్తే మిగతా 4 మిల్లులను కూడా సీజ్ చేయాలని మంత్రి కలెక్టర్ కు చెప్పారు. క్లస్టర్ వైజ్ గా అన్ లోడింగ్ సక్రమంగా జరిగేందుకు ఆఫీసర్లను నియమించాలని మంత్రి సూచించారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే అకాల వర్షాలు అన్న దాతలను నిండా ముంచుతున్నాయి. వరి రైతులు చాలా నష్టపోతున్నారు. తడిసిన ధాన్యంతో ఇబ్బంది పడుతున్నారు. దినికి తోడు రైస్ మిల్లర్లు రైతులను కడ్తా పేరుతో ఇబ్బంది పెట్టడం సరికాదని మంత్రి అన్నారు. జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి రైతులకు అభయమిచ్చారు. కడ్తా సమస్యను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లిన తక్షణమే స్పందించి కలెక్టర్ కు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని చెప్పటంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు రైతులు. అంతకు ముందు అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం... ధాన్యం కొనుగోలు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలని అన్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని అన్నదాతకు భరోసా అందించాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్ లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంట మిల్లులకు తరలించి అన్ లోడింగ్ చేయించాలని అధికారులకు సూచించారు మంత్రి వేముల.

# కుట్లు బదులు ఫెవిక్విక్

**మహబూబ్ నగర్ :**

వైద్యో నారాయణ హరి అంటారు.. అంటే.. వైద్యులు దేవుళ్లతో సమానమని అర్థం.. కానీ.. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వైద్య వృత్తికి కళంకం తెచ్చేలా చేస్తున్నారు.. తాజాగా.. ఓ వైద్యుడు చేసిన పనికి అంతా షాకవుతున్నారు. తల పగిలి ఆసుపత్రికి వస్తే.. ఫెవిక్విక్ తో అతికించేసి పంపించాడు. ఈ షాకింగ్ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజలో చోటుచేసుకుంది. కింద పడి గాయపడిన బాలుడిని తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడి వైద్య సిబ్బంది కుట్లు వేయకుండా ఫెవిక్విక్‌తో అతికించి ఏం కాదంటూ పంపించేశారని బాలుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత బాలుడి తండ్రి వంశీకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాయచూరు జిల్లా లింగసూగూరుకు చెందిన వంశీకృష్ణ, సునీత దంపతులు.. బంధువుల ఇంట్లో పెళ్లి నిమిత్తం అయిజకు వచ్చారు. ఈ క్రమంలో కుమారుడు ప్రవీణ్ చౌదరి (7) గురువారం రాత్రి పెళ్లి వేడుకలో ఆడుకుంటూ కిందపడ్డాడు. ఎడమ కంటి పైభాగంలో గాయం కావడంతో స్థానికంగా ఉండే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, లోతుగా గాయం అయినప్పటికీ.. వైద్య సిబ్బంది కుట్లు వేయకుండా అక్కడున్న ఫెవిక్విక్‌తో అతికించేసి పంపించారు. గమనించిన తండ్రి వంశీకృష్ణ ఆసుపత్రి వైద్యుడు నాగార్జునను ప్రశ్నించగా.. సిబ్బంది పొరపాటుగా చేశారని పేర్కొన్నారని వంశీకృష్ణ తెలిపారు. బాలుడికి ఏమీ కాదని, ఏమైనా జరిగితే తాను బాధ్యతవహిస్తానని చెప్పారన్నారు. ఆసుపత్రి నిర్లక్ష్యంపై బాధిత బాలుడి తండ్రి అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

# అమర్ రాజా కంపెనీకి కేటీఆర్ భూమి పూజ

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచంలో అవినీతి రహిత పారదర్శకమైన పాలనతో ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత దేశంలో ఎక్కడైనా అమరరాజా గ్రూప్ ప్లాంట్ పెట్టుకోవచ్చని, దివిటిపల్లిలో ప్లాంట్ పెడతామని అమరరాజా గ్రూప్ ప్రకటించిన తర్వాత 8 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు వారికి ఫోన్ చేసినట్లు తమ తమ రాష్ట్రానికి రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు. కానీ అమరరాజా గ్రూప్ మాత్రం తెలంగాణలోనే ప్లాంట్ పెట్టడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు అంతర్జాతీయ వేదికలపై ఆయా రాష్ట్రాలు పోటీ పడుతున్నాయని చెప్పుకొచ్చారు కేటీఆర్. మా వద్ద సరిపడ కరెంటు, నీళ్లు, భూములు ఉన్నాయని, మంచి ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మనకున్న శక్తి యువశక్తి అని చెప్పారు. 27 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలు 70 కోట్ల మంది ఉన్నారని, వారికి ప్రభుత్వ ఉ ద్యోగాలు దొరకవు కాబట్టి, వారికి ఉపాధి కల్పించాలంటే ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించాలని కేటీఆర్ చెప్పుకొచ్చారు. పరిశ్రమలకు ఊతమిస్తేనే కొలువులు వస్తాయని, రాష్ట్రానికి సంపద వస్తుందని చెప్పారు. ఈ సంపదను పేదల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు ఉపయోగిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే సమయానికి హైదరాబాద్ ఐటీ రంగంలో 3.23 లక్షల మంది పని చేసేవారని, కానీ ఇప్పుడు దాదాపు 10 లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని కేటీఆర్ వెల్లడించారు. ఒక ఐటీ కంపెనీ ఉంటే దాని చుట్టూ ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. అమరరాజా కంపెనీ రావడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. దీని వల్ల చుట్టు పక్కల ప్రాంతాల రూపు రేఖలు మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ఇతర పరిశ్రమలు కూడా వస్తాయని పేర్కొన్నారు. అమరరాజా గ్రూప్ రాబోయే పదేళ్లలో రూ.9,500 కోట్లు పెట్టుబడి పెట్టబోతున్నట్లు మంత్రి తెలిపారు. మూడేళ్లలో రూ.3 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని, మిగతా పెట్టుబడి దశల వారీగా ఉంటుందని వెల్లడించారు. అమరరాజా 37 ఏళ్ల చరిత్ర పరిశీలిస్తే.. దానికి రెట్టింపు ఈ ఒక్క ప్లాంట్ లోనే పెట్టుబడి పెడుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏపీ పదో తరగతి ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

మంది.. బాలురు 3,09,245 మంది పరీక్ష రాశారు. ఏప్రిల్ 3 నుంచీ 18 వరకు పరీక్షలు జరిగాయి. ఇక ఈ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు. రికార్డు సమయంలో 18 రోజుల్లోనే పది ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. మొత్తం 72.26 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే అధికంగా 6.11 శాతం బాలికలు పాస్ అయ్యారు.

. ఈసారి పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం ప్రభుత్వం జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈసారి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ. బాగా రాశామన్న నమ్మకం ఉన్న వాళ్లు రీ వెరిఫికేషన్ కోసం అప్లై చేసుకోవచ్చని సూచించారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఈ నెల 13 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ తర్వాత కూడా ఉత్తీర్ణత సాధించలేకపోతే... సప్లిమెంటరీకి అప్లై చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. మే 17వ తేదీ లోపు సప్లిమెంటరీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. పదో తరగతిలో తప్పిన వారి కోసం జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబోతున్నారు. జూన్ పది వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి పరీక్షల షెడ్యూల్ వచ్చే వారంలో రిలీజ్ కానుంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతు నిర్వహించబోతున్నట్టు మంత్రి బొత్స ప్రకటించారు. జిల్లాల వారిగా కొన్ని పాఠశాలలను గుర్తించి అక్కడ స్పెషల్ క్లాస్‌లు పెట్టబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయబోతుందన్నారు. 6,64,152 మంది రాసిన పదో తరగతి పరీక్ష పేపర్‌లను ఏప్రిల్ 19 నుంచి 26 వరకు మూల్యాంకనం చేశారు. గతేడాది పదోతరగతి ఫలితాల విడుదల సందర్భంగా జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈసారి ఆలంటి తప్పులకు అవకాశం లేకుండా చూసుకుంది. వాల్యుయేషన్ పక్కగా నిర్వహించామని చెబుతోంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన పదో తరగతి పరీక్షల్లో 72.26 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 69.27 శాతం, బాలికలు 75.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది కంటే ఐదు శాతం ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పాస్ పర్సంటేజ్ పెరిగింది. అది 3.47 శాతం గా ఉంది. జిల్లాల వారీగా చూసుకుంటే ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా ఉంది. ఆ జిల్లాలో పాస్ పర్సంటేజ్ 87.4 శాతం ఉంది. అతి తక్కువ ఉత్తీర్ణతతో నంద్యాల జిల్లా వెనుకబడింది. అక్కడ పాస్ పర్సంటేజ్ 60.39శాతం. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 95.25 శాతం మంది విద్యార్థులు పదో తరగతిలో పాస్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 938 స్కూల్స్ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. 38 స్కూల్స్‌లో ఒక్కరు కూడా పాస్ కాలేదు.

గతంలో పదోతరగతి పరీక్షల్లో ఒక్కో సబ్జెక్ట్‌కు రెండేసి పేపర్లు ఉండేవి ఈసారి మాత్రం ఒక పేపర్ విధానం తీసుకొచ్చారు. ఈ పరీక్షలకు 6,09,081 మంది రెగ్యులర్ విద్యార్థులు అప్లై చేసుకోగా... అందులో6,05,052 మంది మాత్రమే పరీక్షలు రాశారు. పరీక్షకు హాజరైన వారిలో 3,09,245 మంది బాయ్స్ ఉంటే... 2,95,807 మంది బాలికలు ఉన్నారు.

**18 రోజుల్లో ఫలితాలు**

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. అమరావతిలో ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. అధికారిక వెబ్‌సైట్ ఎబవ.జీజూ.ఐనీల.తినిలో ఫలితాలను చూడొచ్చు. ఈ ఫలితాలపై బొత్స సంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి 3 నుంచి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈసారి ఆరు పేపర్లకే పరిమితం చేశామన్నారు. రికార్డు స్థాయిలో ఎలాంటి వివాదాలు లేకుండా 18 రోజుల్లోనే ఫలితాలు ఇచ్చామని పేర్కొన్నారు బొత్స. పరీక్షల్లో తప్పిన విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని బొత్స సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఈ ఏడాది వృథా కాకుండా సప్లిమెంటరీ పరీక్షలు పెట్టామని అందులో పాస్ అయ్యేలా ట్రై చేయాలన్నారు. ఒక ఏడాది పోయినా జీవితం చాలా ఉందన్నారు. ఒక ఓటమి గెలుపునకు పునాదిగా భావించాలని సూచించారు. విద్యార్థలను తల్లిదండ్రులు నిత్యం కాపాడుకుంటూ ఉండాలని వారిలో ఆత్మస్థైర్యం నింపాలని సూచించారు. 6,64,152 మంది రాసిన పదో తరగతి పరీక్ష పేపర్‌లను ఏప్రిల్ 19 నుంచి 26 వరకు మూల్యాంకనం చేశారు. గతేడాది పదోతరగతి ఫలితాల విడుదల సందర్భంగా జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈసారి ఆలంటి తప్పులకు అవకాశం లేకుండా చూసుకుంది. వాల్యుయేషన్ పక్కగా నిర్వహించామని చెబుతోంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన పదో తరగతి పరీక్షల్లో 72.26 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 69.27 శాతం, బాలికలు 75.38 శాతం ఉత్తీర్ణత సాధించారు

# ఘనంగా తిరుపతి గంగమ్మ జాతర

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్న ఆలయ కుంభాభిషేక కార్యక్రమం నేటితో ముగిసింది. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి అమృత హస్తములచే స్వర్ణ యంత్ర స్థాపన కార్యక్రమం జరిగింది. అమ్మవారి ఆలయ బంగారు శిఖరాన్ని ప్రతిష్ట చేసి... ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ శిఖర ప్రతిష్ట కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తో పాటు నగర డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని పూర్తి చేసి... అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా ప్రత్యేక హోమగుండాలలో కలస స్థాపన చేసి ఆగమక్తంగా పూజలు చేస్తున్నారు. ఈ కలసాలలోని జలాలను కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి స్వహస్తాలతో అమ్మవారినీ అభిశేకింప చేశారు. ప్రతి గ్రామంలో అలయాలు పున : నిర్మాణాలు చేపట్టి కుంభాభిషేకాలు నిర్వహించాలని... అప్పుడే గ్రామం, జిల్లా, రాష్టం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు కంచి పీఠాధిపతి. గంగ పురస్కారాలు సందర్భంగా తిరుపతి లో గంగమ్మ తల్లికి మహా కుంభాభిషేకం నిర్వహించడం శుభ సూచకమని... ప్రతి ఒక్కరు నిత్యం భవంతుని నామాన్ని జపిస్తూ ఉండాలన్నారు విజయేంద్ర సరస్వతి స్వామి. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శనాన్ని కల్పించారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేసిన తరువాత... గంగమ్మను దర్శించుకోవడానికి



స్థానిక భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. అయితే అమ్మవారి పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి , స్వాత్మానందేంద్ర స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి దగ్గరుండి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వరూపానందేంద్ర పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్ గా ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలు ఎవరు మరిచిపోలేరని, తాను కరుణాకర్ రెడ్డి కి ప్రత్యేక గుర్తింపు ఇస్తాను అన్నారు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి. అనంతరం అమ్మవారి తొలి దర్శనానికి భక్తులను అనుమతిఇచ్చారు. చాలా రోజుల విరమణ తర్వాత తిరుపతి గంగమ్మ దర్శనం కలుగుతుండడంతో స్థానిక భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇక రానున్న మంగళవారం నుంచి తిరుపతిలో జాతర హడావిడి ప్రారంభం కానుండడంతో... జాతర ఏర్పాట్లపై దృష్టి పెడుతున్నారు ఆలయ అధికారులు. ఇక ఈ ఏడాది తిరుపతి జాతరను రాష్ట్ర పండుగ హోదాగా ప్రకటించడంతో దానికి తగ్గట్టుగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. వారం రోజులపాటు జరిగే జాతరలో పెద్ద ఎత్తున భక్తులు వేషాలు వేయడంతో పాటు... వెయ్యికళ్ల దుత్త లు సమర్పించే ఆచారం కూడా ఉంది. దీంతో అమ్మవారి ఆలయ పరిసరాలలో దీనికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆలయ పాలకమండలి సిబ్బందిని ఆదేశించింది. ఇప్పటికే జాతరపై పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ఆలయ అధికారులు... తిరుపతి నగరాన్ని మొత్తం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

# జైల్ సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ

**రాజమండ్రి:**

రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాజారావు ఆకస్మిక బదిలీ అయ్యారు. విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.రాహుల్‌ను రాజమండ్రికి నియమించారు. రాజారావును నెల్లూరులోని కేంద్ర కారాగారాల శిక్షణ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది ఏపీ ప్రభుత్వం. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ చుట్టూ రాజకీయం అలముకుంది.రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ మామ ఆదిరెడ్డి అప్పారావు, భర్త ఆదిరెడ్డి వాసు అరెస్టుల అనంతరం రిమాండ్‌లో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఆదిరెడ్డి కుటుంబం నిర్వహిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సీఐడీ పోలీసులు ఆ కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి ఆదిరెడ్డి అప్పారావు, వాసులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆదిరెడ్డి కుటుంబాన్ని టీడీపీ నాయకులు వరుసగా వచ్చి కలుస్తుండడం, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడం జరుగుతోంది.టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు వచ్చి ములాఖత్ ద్వారా సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆదిరెడ్డి అప్పారావు, వాసులను కలిసేందుకు దరఖాస్తు చేయించారు. అయితే ఈ ప్రక్రియ అంతా మెయిల్ ద్వారా చేపట్టగా దీనికి సూపరెంటెండెంట్ రాజారావు అనుమతిని ఇచ్చారు. చంద్రబాబుతోపాటు మరో వ్యక్తికి మాత్రమే ములాఖత్ అవకాశం కల్పించారు. మెయిల్ ద్వారా ములాఖత్‌కు దరఖాస్తు చేయడమే కాకుండా మాజీ మంత్రి కేఎస్ జవహర్ ద్వారా నేరుగా జైలు సూపరింటెండెంట్ ను కలిసి ములాఖత్ అనుమతి కోసం పత్రాలు సమర్పించేందుకు వెళ్లగా దానికి అధికారులు తిరస్కరించారు. అప్పటికే మెయిల్ కు తమకు వివరాలు అందాయని, ఇక అవసరం లేదని తిరస్కరించారు. రాజమండ్రి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాజారావు ఆకస్మిక బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. ఆయన నిబంధనల ప్రకారమే చంద్రబాబుకు ములాఖత్ ద్వారా కలిసేందుకు అనుమతి ఇచ్చారని, దీంట్లో ఆయన చేసిన తప్పేముందని ప్రశ్నిస్తున్నారు. అయితే రిమాండ్‌లో సెంట్రల్ జైలులో ఉన్న ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు జైలులో రాచమర్యాదలు చేయిస్తున్నారని, టీడీపీ నాయకులు కలిసేందుకు అనుమతులు ఇస్తున్నారని ప్రధాన ఆరోపణలు చేస్తూ రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ ఇంచార్జి మిధున్‌రెడ్డికి ఫిర్యాదు చేశారని, ఈ క్రమంలోనే ఆయన అధిష్టానంతో మాట్లాడి వెంటనే రాజారావును వేరే చోటకు ఆకస్మికంగా బదిలీ చేయించారని పొలిటికల్ సర్కిల్‌లో సర్క్యులేట్ అవుతోంది.

# బాలినేని వైసీపీకి దూరమవుతున్నారా ?

**ఒంగోలు :**

అనుకున్నంతా అయింది, మాజీ మంత్రి బాలినేని ఎపిసోడ్ కి ఎండ్ కార్డ్ పడే సమయం దగ్గరకు వచ్చింది. వైసీపీలో ఇక బాలినేని ఇమడలేరు అనే విషయం నిర్ధారణ అయింది. జగన్ తో తనకేమాత్రం ఇబ్బంది లేదు అంటూనే బాలినేని సొంత పార్టీ నేతలకు చీవాట్లు పెట్టారు. వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తమ పార్టీలో కొందరిపై పరోక్ష విమర్శలు చేశారు. ఓ దశలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనపై నిందలు ఆరోపణలు భరించలేకపోతున్నానని కంటతడి పెట్టారు. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని వాపోయారు. గొనె ప్రకాశ్‌రావుకి వైవీ సుబ్బారెడ్డి దేవుడిగా కనిపిస్తే అభ్యంతరం లేదు..కాని తన గురంచి మాట్లాడాల్సిన అవసరం ఏంటని బాలినేని ప్రశ్నించారు. తాను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు.తాను పార్టీ మారుతున్నట్లు ప్రచారాలు కూడా చేస్తున్నారని.. ఇవన్ని ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసని విమర్శించారు. ఒంగోలులో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. కానీ ఇతర నియోజక వర్గాల్లో ఇలాంటి వాటిని చూడలేకపోతున్నానని తెలిపారు.కొంతమందికి సిగ్గులేదంటూ మాట్లాడారు. వారి పేర్లు బయటపెట్టడానికి తనకు సిగ్గుందని, తాను అలాంటి పనులు చేయబోనని, పార్టీని ఇబ్బంది పెట్టబోనని అన్నారు. బాలినేని టార్గెట్ వైవీ సుబ్బారెడ్డి



అనే విషయం ఆయన నోటివెంటే బయటపడింది. తెలంగాణకు చెందిన గోనె ప్రకాష్ రావు, తన గురించి చేసిన వ్యాఖ్యలపై సీరియస్ గా రియాక్ట్ అయ్యారు బాలినేని. ఓ వైపు వైవీ సుబ్బారెడ్డిని దేవుడని, ఆయన భార్య దేవత అని గోనె ప్రకాష్ రావు పొగుడుతున్నారని, అదే నోటితో ఆయన జగన్ ని తిడుతున్నారని, ఇదెక్కడి లాజిక్ అన్నారు. పరోక్షంగా వైవీ సుబ్బారెడ్డి, వైసీపీకి నష్టం చేకూరుస్తున్నారని మాట్లాడారు. తాను పార్టీ మారబోతున్నట్టు వస్తున్న వార్తలపై కూడా బాలినేని స్పందించారు. తాను ఎవరిపైనా అధిష్టానానికి ఫిర్యాదు చేయలేదని, చేయబోనని, అది తన నైజం కాదన్నారు బాలినేని. కానీ తనపై చాలామంది అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారని, పార్టీ మారుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని చెప్పారు. ప్రెస్ మీట్లో బాలినేని ఓ విషయంపై క్లారిటీ ఇచ్చారు. సహజంగా పార్టీ మారే ముందు ఎవరైనా కార్యకర్తల అభీష్టం మేరకే అంటారు. బాలినేని కూడా ఇప్పుడు కార్యకర్తలు, అనుచరుల పేర్లు తెరపైకి తెచ్చారు. తనని నమ్ముకుని ఉన్న కార్యకర్తలకోసం తాను ఎందాకైనా పోరాటం చేస్తానన్నారు. వారి కోసం తాను రాజకీయంగా నష్టపోయినా పరవాలేదన్నారు. రేపు పార్టీ మారినా కార్యకర్తలు, అనుచరులకోసమే అని చెప్పేందుకు ఆయన రూట్ క్లియర్ చేసుకున్నారని అర్థమవుతోంది. ఓ దశలో బాలినేని భావోద్వేగాన్ని దాచుకోలేకపోయారు. ఆయన కళ్లు చెమర్చాయి. గంభీరంగా ఉండే బాలినేని ప్రెస్ మీట్లో ఇలా బేలగా మారిపోవడం అక్కడున్నవారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. నియోజకవర్గంలో గడప గడపకు తిరిగే అవకాశం లేకపోవడం వల్లే తాను ఇన్ చార్జ్ పదవికి రాజీనామా చేశానని చెప్పిన బాలినేని, ప్రెస్ మీట్లో జగన్ గురించి పెద్దగా మాట్లాడలేదు. తనకు వైఎస్ఆర్ అన్నీ అన్నట్టుగా మాట్లాడారు. దాదాపుగా వైసీపీలో బాలినేని ఎపిసోడ్ ముగిసిపోయిందనే చెప్పాలి. వైసీపీ బాలినేనిని దూరం పెట్టింది అని చెప్పడానికి ప్రెస్ మీట్ ఓ ఉదాహరణ. ఈ ప్రెస్ మీట్ ని సాక్షి కవర్ చేయలేదు. సహజంగా బాలినేని ప్రెస్ మీట్ అంటే అధికార పార్టీకి చెందిన ఛానెల్ లైవ్ కి రెడీగా ఉంటుంది. కానీ సాక్షి చప్పుడు చేయలేదు. అంటే పరోక్షంగా అందరికీ బాలినేని విషయంలో ఓ హింటిచ్చేసింది అధిష్టానం. ఇక అధికారిక నిర్ణయమే తరువాయి. బాలినేని ప్రెస్ మీట్ పై వైసీపీనుంచి ఎలాంటి రియాక్షన్ ఉంటుందో చూడాలి.

# సంజయ్ ఘర్ వాపసీ లాభం లేదా

**నిజామాబాద్ :**

నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్?. కొద్ది రోజుల క్రితం ఘర్ వాపసీలో భాగంగా.. తన తండ్రి డీఎస్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన్ని పార్టీలోకి తిరిగి రానీయకుండా జిల్లా నేతలు చాలా కాలం అడ్డుకున్నా..చివరికి ఆపలేకపోయారట. కుమారుడితో పాటే కాంగ్రెస్ కండువా కప్పుకున్న డీఎస్.. ఆ తర్వాత మాట మార్చడంతో అసలా చేరికే గందరగోళంలో పడింది.దీంతో కొన్నాళ్ళు మౌనంగా ఉన్నారు సంజయ్. పార్టీ కార్యక్రమాలకు హాజరవడం లేదు. ఆయన చేరికను తాము గుర్తించడం లేదన్నట్లు జిల్లా నేతలు సైతం పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానం పంపడం లేదట. దీంతో సంజయ్.. తన ఇంటినే పార్టీ లోకల్ ఆఫీస్‌గా చేసుకుని.. చేరికలను ప్రోత్సహిస్తున్నారట. అయితే.. తమ అనుమతి లేకుండా జరిగే ఆ చేరికలు కూడా చెల్లవంటూ క్లారిటీ ఇచ్చేశారు నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ నేతలు. ఎవరు ఏం అనుకున్నా.. నా దారి నాదేనంటూ తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నారట సంజయ్. అర్బన్ కాంగ్రెస్ లో యాక్టివ్ రోల్ పోషించేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారట.నిజామాబాద్ అర్బన్ సీటు పై కన్నేసిన సంజయ్.. ఆ వ్యూహంలో భాగంగానే హస్తం గూటికి చేరి చాప కింద నీరులా తన పని తాను చేసుకుపోతున్నారన్నది లోకల్ టాక్. ఈ పాటికే అర్బన్ సీటు పై కన్నేసిన .. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అర్బన్ నా అడ్డా అంటున్నారట. ఈ సీటును వదులుకునే ప్రసక్తేలేదని తన అనుచరుల దగ్గర చెబుతున్నారట. గత ఎన్నికల్లో అర్బన్ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో ఉన్న సీనియర్ నేత తాహెర్ బిన్ హందాన్, అర్బన్ పార్టీ అధ్యక్షుడు కేశ వేణు సైతం ఒక్క ఛాన్స్ అంటున్నారట. అందుకే అంతా కలిసి సంజయ్‌కి పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానం పంపకుండా , జిల్లా పార్టీ కార్యాలయంలో అడుగు పెట్టకుండా జాగ్రత్త పడుతున్నారట. మాజీ మేయర్ సైతం దూకుడుగా వ్యవహరించకుండా అవకాశం కోసం ఎదురుచూస్తూ.. అండర్ గ్రౌండ్ లో తన పని తాను చేసుకుంటూ పోతున్నారట. అయితే ఆ మౌనం వెనక ఉన్న వాస్తవాలు ఏంటో తెలుసుకునే ప్రయత్నంలో ఉంది రాజకీయ ప్రత్యర్థి వర్గం. ఇలా నిజామాబాద్ అర్బన్ టికెట్ కోసం నాలుగు స్తంభాలాట నడుస్తుండగా? రేసులో ఎవరు ముందుంటారో తేలాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# ఆగని ప్రైవేట్ హాస్పటల్ల దందా...

**హైదరాబాద్ :**

ఆమనగల్లు పట్టణ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌పై వైద్య ఆరోగ్యశాఖఅధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.సరైన ప్రమాణాలు పాటించని హాస్పిటల్లలో వైద్యం త్రీ సూదులు,6 గోలీలుగా వర్ధిల్లుతోంది. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది లేకపోయినా.. కేవలం డాక్టర్ సర్టిఫికెట్లు మాత్రమే చూపించి ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహించేందుకు అనుమతులు పొందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.కనీస వసతులు లేని ఆసుపత్రుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీలకు, పిఎంపీలకు, అంబులెన్స్ డ్రైవర్లకు కమిషన్ల ఎర చూపించి పేషెంట్లను తమ ఆసుపత్రులకు రప్పించుకుంటున్నారు. ఇష్టం వచ్చిన రీతిలో వైద్యం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలు అధికమయ్యాయి. ఆసుపత్రులతో పాటు రక్త పరీక్షలు, ఎక్స్ రే క్లినిక్ లు యదేచ్ఛగా వారికి నచ్చిన ధరలలో కొనసాగిస్తున్నారు.ఆర్ఎంపీలు సైతం పెద్ద పెద్ద ఆస్పత్రులను ఏర్పాటు చేసుకొని అన్ని రోగాలకు చికిత్సలు నిర్వహిస్తున్నా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిద్రమత్తును విడడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలతో పాటు మునిసిపాలిటీ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిజ్ఞానం ఉన్న వైద్యులు లేకపోగా.. ల్యాబ్ టెక్నీషియన్లుగా గుర్తింపు లేని వ్యక్తులను నియమించుకొని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేయాలి? ఏ చికిత్సకు ఎంత డబ్బు చెల్లించాలి? అనే బోర్డులను ప్రదర్శించాల్సి ఉంటుంది. కానీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్స కోసం దేనికి ఎంత చెల్లించాలి? అనే సూచిక బోర్డులు లేకపోవడంతో గ్రామీణ నిరక్షరాస్యులైన పేద ప్రజలను దొరికిన కాడికి దోచుకుంటున్నారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న డయాగ్నస్టిక్స్, ఫిజియోథెరపీ, ల్యాబులు ఫీజుల విషయంలో కూడా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కానింగ్ సెంటర్లు నడవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని వైద్యులు కొంతమంది డబ్బే ప్రధాన ఎజెండాగా గర్భిణీ మహిళలకు అబార్షన్లు చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు.లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ గతంలో కొంతమంది వైద్యులు పట్టుబడ్డ దాఖలాలు కూడా ఉన్నాయి.4 మండలాలకు కూడలిగా హైదరాబాదుకు సమీపంలో గల ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రవేట్ హాస్పిటల్స్ ఉన్నాయి. మారుమూల గ్రామ ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు వచ్చే పేదలకు వైద్యం పేరుతో వారి ప్రాణాలను బలిగొంటున్నారు. పట్టణంలోని స్వాతి మల్టీప్లెక్స్ హాస్పిటల్‌లో 2 రోజుల క్రితం నరేష్ రెడ్డి అనే యువకుడు మరణించిన విషయాన్ని పట్టణ ప్రజలు గుర్తు చేస్తున్నారు. గతంలో కూడా తలకొండపల్లి మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన గర్భిణి మహిళ ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ధర్నా చేపడతామని హెచ్చరించడంతో,విషయం బయటకు పోకుండా హైదరాబాద్‌లో మంతనాలు జరిపి 8 లక్షల వరకు డబ్బులు ముట్ట చెప్పిచేతులు దులుపుకున్నారు.గత 2 రోజుల క్రితం రాంపూర్ గ్రామానికి చెందిన నరేష్ రెడ్డి కూడా డాక్టర్ల ఆపరేషన్ వికటించి మృతి చెందడంతో కుటుంబసభ్యులు పెద్దఎత్తున ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టారు. చివరకు కొంతమంది నేతలు మంతనాలు జరిపి బాధిత కుటుంబసభ్యులకి పెద్దమొత్తంలో డబ్బు ముట్టచెప్పి చేతులు దులుపుకున్నట్లు మున్సిపాలిటీ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఆమనగల్ పట్టణ కేంద్రంలోని ఆసుపత్రుల పరిస్థితి ఎలా ఉందంటే, ఎవరు చనిపోయిన డోంట్ కేర్.. డబ్బులు ఉంటే చాలు కిమ్ అనకుండా లోలోన ముట్ట చెప్పి 4 రోజులు ఆస్పత్రి బందు చేసి,అనంతరం మళ్లీ డాక్టర్లను నేమ్ బోర్డు మార్చేసి తెరుచుకొని నడపొచ్చు అనే ధీమాలో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని ఆసుపత్రులపై, ల్యాబ్ లపై, స్కానింగ్ సెంటర్లపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఐటీ టవర్

**మహబూబ్ నగర్ :**

హైదరాబాద్ ఐటీ రంగం హబ్‌గా ఉంటూనే, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఐటీ టవర్ల నిర్మాణం వంటి రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలోని టైర్-2 నగరాలు ప్రధాన వృద్ధి చోదకులుగా ఎదుగుతున్నాయి. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని. అందులో భాగంగానే ఐటీ కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పేందుకు సకల సౌకర్యాలతో నాలుగు ఎకరాల సువిశాల స్థలంలో రూ.40 కోట్లతో నిర్మించిన ఐదంతస్తుల ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మహబూబ్‌నగర్ శివార్లలోని దివిటిపల్లిలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని టైర్-2 నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించే ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. 2018 జూలైలో మంత్రి కెటి రామారావు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇవే కాకుండా 377 ఎకరాల్లో ఐటీ పార్కును కూడా అభివృద్ధి చేస్తున్నారు. అలాగే, హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిని కలుపుతూ టవర్ నుండి 100 అడుగుల రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ఐటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈవో విజయ రంగినేని మాట్లాడుతూ.. ఐటీ టవర్ నుంచి ఇప్పటి వరకు తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి ఎనిమిది కంపెనీలు ముందుకు వచ్చాయని, స్థలం కేటాయించామని తెలిపారు. కాగా, ప్రారంభోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.

# హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం

**డ్రగ్స్ ఫెడ్లింగ్ చేస్తున్న నలుగురితో కలిసిన గ్యాంగ్‌ను అరెస్ట్**

**303 గ్రాముల కొకైన్ సీజ్... సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టుబడిన విషయం తెలిసిందే. డ్రగ్స్ ఫెడ్లింగ్ చేస్తున్న నలుగురితో కలిసిన గ్యాంగ్‌ను అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 303 గ్రాముల కొకైన్ సీజ్ చేశామని తెలిపారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ డ్రగ్స్ ముఠాకు కింగ్ పిన్‌గా చింతా రాకేష్ అనే వ్యక్తి వ్యవహరిస్తున్నాడని వెల్లడించారు. చింతా రాకేష్ లోకల్‌గా ఇద్దరు పెడ్లర్‌లను హైర్ చేసుకున్నాడని తెలిపారు.ఇంకా సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ.. "చింతా రాకేష్ గోవాకు వెళ్ళినపుడు నైజీరియన్స్ గాబ్రియేల్, విక్టర్‌తో పరిచయం ఏర్పడింది.. గోవాలో ఓసారి కొకైన్ తీసుకున్నాడు... క్రమంగా డ్రగ్స్‌కు రాకేష్ అడిక్ట్ అయ్యాడు. ఏ1 రాకేష్ రోషన్ డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేసి నష్టపోయాడు. రాకేష్ గాబరియాల దగ్గర కొకైన్ గ్రాముకు 7వేల రూపాయలకు కొని.. హైదరాబాదులో గ్రాముకు18 వేల చొప్పున



విక్రయిస్తున్నాడన్నారు. బాచుపల్లికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తిని సహ పెడ్లర్‌గా నియమించుకున్నాడు. శ్రీనివాస్ రెడ్డి కూడా వ్యాపారంలో నష్టపోయాడు. రాకేష్ శ్రీనివాస్ రెడ్డిని గోవాకు పంపి అతని ద్వారా నగరానికి తెప్పించేవాడు. శ్రీనివాస్ విక్రయించడంతోపాటు కమిషన్‌ను రాకేష్‌కు ఇచ్చేవాడు. సూర్య ప్రకాష్ అనే మరో వ్యక్తిని కూడా రాకేష్ సహ పెడ్లర్‌గా నియమించుకున్నాడు.

రాకేష్ సూచన మేరకు సూర్య ప్రకాష్ 23 గ్రాముల కొకైన్ తీసుకువచ్చాడు. అందులో ఆరు గ్రాములు శ్రీనివాస్ రెడ్డికి ఆరు గ్రాములు రాకేష్ కు ఇచ్చాడు. హైదరాబాద్‌లో డ్రగ్స్‌కు డిమాండ్ ఉందని నగరానికి రావాలని విక్టర్‌కు సూర్యప్రకాష్ సూచించాడు. ఇందులో భాగంగా 100 గ్రాముల కొకైన్‌తో విక్టర్ నగరానికి చేరుకున్నాడు. కొకైన్ విక్రయిస్తుండగా నానక్‌రాం గూడాలో సూర్య ప్రకాష్, విక్టర్‌లను అదుపులోకి తీసుకున్నాం. సూర్య ప్రకాష్‌ను విచారించగా శ్రీనివాస్ రెడ్డి చింతా రాకేష్‌ల పాత్ర బయటపడింది. వినియోగదారుల లిస్ట్ ఉంది.. వారిని గుర్తించి నోటీస్ ఇస్తామన్నారు. గాబ్రియల్ నైజీరియాకు వెళ్లిపోవడంతో విక్టర్ మాత్రమే పట్టుబడ్డాడు.చాలాకాలంగా ఈ గ్యాంగ్ డ్రగ్స్ విక్రయిస్తోంది. వాట్సాప్ ద్వారా డ్రగ్స్ క్రయవిక్రయాలను కొనసాగించారు వాట్సాప్ చాట్ కూడా సంపాదించాం. విక్టర్ దగ్గర డ్రగ్స్ క్యాప్సూల్స్ దొరికాయి. వాస్తవానికి ఈ క్యాప్సూల్స్‌ను కడుపులో పెట్టుకొని అక్రమంగా తరలిస్తూ ఉంటారు. నిందితుల వద్ద సేకరించిన సమాచారం ప్రకారం డ్రగ్స్ వినియోగదారులు బిజినెస్ మాన్స్ కూడా ఉన్నారు. నిడిదలు పార్టీలకు కూడా ఒక అయిన సరఫరా చేసినట్టు తేలింది. నిందితులను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి" అని పేర్కొన్నారు.

# తెలంగాణ సొమ్ము మీతాత జాగీరా కేసీఆర్?-షర్మిల

**హైదరాబాద్**

తెలంగాణ సొమ్మె మీ తాతా జాగీరా అని వైఎస్సార్ టీపీ పార్టీ అధినేత్రి షర్మిల సీఎం కేసీఆర్ ను ప్రశ్నించారు. తెలంగాణ నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఉద్యోగాలు ఇవ్వడం చేతకాలేదు కానీ, పక్క రాష్ట్రంలోని మీ పార్టీ వ్యక్తికి రూ.18లక్షల ప్యాకేజీతో ఉద్యోగం ఇస్తావా? తెలంగాణ సంపద ఏమైనా మీ అత్తగారి సొమ్మా అని అడిగారు. తెలంగాణ కొలువులు ఏమైనా మీ ఇంట్లో..నౌకరు పదవులా మీ ఇష్టారాజ్యంగా రాసివ్వడానికి? అందుకోసమేనా పేపర్లు లీక్ చేసి అమ్ముకుంటున్నారు? జీవోలు దాచిపెట్టి కొలువులు కట్టబెడుతున్నారు? నీ పార్టీ ఖజానాలో ఉన్న రూ.1250 కోట్లు సరిపోవడం లేదా? ఇంకా ప్రభుత్వ ఉద్యోగాలను కూడా నీ పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టాలని చూస్తున్నావా? ఇలా జీవోలను దాచిపెట్టి ఇంకా ఎంతమందికి కొలువులు ఇచ్చారు? మీ పార్టీ కార్యకర్తలకు పదవుల కోసం ఇచ్చిన జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ప్రజాతపన prajathapana.com

# ప్రియాంకపైనే ఆశలు

**హైదరాబాద్ :**



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ జనంలోకి వెళ్లే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అధికార పార్టీతో పాటు బీజేపీకి ధీటుగా సభలు, సమావేశాలతో హోరెత్తించాలన్న వ్యూహంలో భాగంగా ఈ నెల 8న సరూర్ నగర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. నిరుద్యోగులు, యువతను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ సభకు ప్రియాంక గాంధి హాజరు కానున్నారు. యూత్ డిక్లరేషన్ సభ గా పేరు పెట్టిన ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా నిరుద్యోగులు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. ఇంతకు ముందు చాలా సార్లు ప్రియాంక హైదరాబాద్‌కు వచ్చినప్పటికీ? రాజకీయ సభలో పాల్గొనటం ఇదే మొదటి సారి కావడంతో ఈ నిరుద్యోగ సభపై ఆసక్తి నెలకొంది. అందుకు తగ్గట్టే భారీ ఏర్పాట్లు చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జిగా ప్రియాంకా గాంధీ ఉండబోతున్నారన్న ప్రచారం కొంత కాలంగా సాగుతోంది. ప్రియాంక గాంధీని తెలంగాణ ఇన్‌చార్జిగా నియమించబోతున్నారంటూ గతంలోనూ ఈ తరహా ఊహాగానాలు వెలువడ్డాయి. ఫిబ్రవరి 2019లో ఆమె క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టినప్పుడు తొలి బాధ్యతగా తెలంగాణ కాంగ్రెస్‌ను అప్పగించబోతున్నారని ప్రచారం నడిచింది. కాంగ్రెస్ వర్గాలు కూడా ఈ ప్రచారాన్ని ఖండించలేదు. కానీ చివరికి అటువంటిదేమీ జరగలేదు. నాడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. దీంతో అప్పటి నుంచి ఈ బాధ్యతల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇక గతేడాది కూడా ప్రియాంక గాంధీకి దక్షిణాది రాష్ట్రాల బాధ్యతలు అప్పగించబోతున్నారని స్వయంగా కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ కాంగ్రెస్ నేతలతో సమావేశాలు కూడా నిర్వహించారు. కానీ అధికారికంగా ప్రకటన చేయలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు పార్టీ ఇంచార్జీగా ప్రియాంకా గాంధీ వ్యవహరించే అవకాశం ఉంది. అయితే అధికారికమా.. అనధికారికంగా అన్నదానిపై స్పష్టత లేదు. ప్రియాంకా గాంధీ ఇప్పటి వరకూ యూపీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో బాధ్యతలు తీసుకున్నారు. దక్షిణాదిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. ఉత్తరాదిలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య కొన్ని రాష్ట్రాల్లో హోరాహోరీ పోరు నడుస్తోంది. దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి.. ప్రాంతీయ పార్టీల మధ్య పోరు నడుస్తోంది. కర్ణాటకలో బీజేపీతో పోటీ పడుతోంది. అయితే దక్షిణాదిలోనూ బలంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో ఆ పార్టీ బలహీనపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల్లోకి వెళ్లి అధికారం దక్కించుకోవడంలో రెండు సార్లు విఫలం కావడమే కాకుండా ఇప్పుడు మరింతగా బలహీనమవుతోందన్న అభిప్రాయాలు కాంగ్రెస్ మీద వస్తున్నాయి. దీంతో స్వయంగా ప్రియాంకా గాంధీ రంగంలోకి దిగాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రియాంగా గాంధీకి మొదటి టాస్క్‌గా తెలంగాణ ఉండే అవకాశం ఉంది. ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారం అంతా రచ్చ రచ్చగా ఉంది. ఇప్పుడు ప్రియాంకా గాంధీ ఎంట్రీతో వీటన్నింటికీ చెక్ పెట్టే అవకాశం ఉందని అనుకోవచ్చు. ప్రియాంకా గాంధీ ఇటీవల రాజకీయాలను సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఆమెకు మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని.. కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతూ ఉంటాయి. ప్రియాంక కాంగ్రెస్ రాత మారుస్తుందని క్యాడర్ గట్టి నమ్మకంతో ఉన్నారు.

# గులాబీ సోషల్ మీడియా అలెర్ట్...

**హైదరాబాద్ :**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా యాక్టివిటీస్‌ను అలర్ట్ చేసింది. నియోజకవర్గాల వారీగా కమిటీలతో ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని సోషల్ మీడియాలో మరింత ప్రచారం ఎలా చేయాలనే అంశాలపై వివరిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని, అందుకు గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి మరింత వేగం పెంచాలని భావిస్తున్నది. రాబోయే అన్ని ఎన్నికల్లో సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే గ్రామ, వార్డు, మండల, డివిజన్, నియోజకవర్గ, జిల్లా కమిటీలలో యాక్టివ్‌గా ఉన్న వారిని గుర్తించి సోషల్ మీడియా కమిటీని నియమించింది. అయితే వారికి పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలనే దానిపై పార్టీ దృష్టి సారించింది. అందులో భాగంగానే సెగ్మెంట్ల వారీగా సోషల్ మీడియా కమిటీలతో ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతోంది. ఈ సమ్మేళనాల్లో ఎవరు ఏ పోస్టు పెట్టాలి.. దానిని ఎలా విస్తృతం చేయాలనే దానిని వివరిస్తున్నారు. అంతేకాకుండా పార్టీ నేతల్లో ఏమైనా గ్యాప్ ఉంటే వాటిని ఎలా పూడ్చాలి.. వారిపై వస్తున్న ఆరోపణలకు ఎలా చెక్ పెట్టాలనే దానిపై ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు తెలుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్, ఆయన కుటుంబం, నేతలపై వచ్చే ఆరోపణలను ఎలా తిప్పికొట్టాలనే దానిపైన ఆత్మీయ సమ్మేళనాల్లో శ్రేణులకు వివరిస్తున్నారు. గ్రామంలో, మండలంలో, నియోజకవర్గంలో ప్రతిపక్ష ప్రజాప్రతిధులు ఉంటే వారు చేయని పనులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్న దగ్గర చేసిన పనులను పోల్చుతూ పోస్టులు పెట్టేలా సమాయత్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఒక వార్డులో రెండు వాట్సాప్ గ్రూపులను చేసి వాటిలో నిత్యం బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించేలా ప్లాన్ చేస్తున్నారు. వారికి ప్రతి రోజూ రాష్ట్ర కమిటీ మానిటరింగ్‌తో పాటు ఏ పోస్టు పెట్టాలి.. దేనిని విస్తృతంగా వివరించాలనే దానిపై మార్గనిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే విపక్ష పార్టీలు సామాజిక మాధ్యమాల్లో దూకుడు పెంచడంతో అధికార బీఆర్ఎస్ సైతం అదేస్థాయిలో దూకుడు పెంచాలని భావించి సోషల్ మీడియా కమిటీలతో ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతున్నది.

# ప్రపంచంలోనే అతిపెద్ద స్టెయిన్ లెస్ స్టీల్ కట్టడం

**హైదరాబాద్ :**

హైదరాబాద్ మణిహారంగా ప్రసిద్ది చెందిన హుస్సేన్ సాగర్ తీరాన ఇటీవల 125 అడుగుల ప్రపంచంలోనే ఎతైన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం, ఆ తరువాత మరికొద్దిరోజులకే అధునాతన హంగులతో నిర్మించిన నూతన సచివాలం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇక్కడే మరో అద్భుత నిర్మాణం అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేస్తున్నారు. సాగర తీరాన నిర్మాణం పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్న అమరవీరుల స్మారకం వచ్చే నెలలో సీఎం కేసీఆర్ చేతులు మీదుగా ప్రరంభించనున్నట్లు తాజాగా ఆర్ అండ్ బి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రకటించారు.

తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివి. 2014లో తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున లేచిన క్షణంలో వందల మంది ఆత్మబలిదానం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రకటనకు ముందు చోటుకున్న అనేక పరిణామాలు అప్పట్లో తెలంగాణ యువతను కలిచివేశాయి. ఇక తమ ఆశల తెలంగాణ సాధించుకోవడం అసాధ్యమనుకుని ప్రాణాత్యాగాలకు పూనుకున్నారు. మరెందరో ఇప్పటికీ వికలాంగులుగా మిగిలిపోయారు. అంతలా ఉద్యమ వీరుల త్యాగాలు భావితరాలకు గుర్తు చేసేలా ఈ స్థూపం నిర్మాణం చేపట్టడమేకాదు, దేశంలోనే అరుదైన ,అద్భుత నిర్మాణంగా రూపొందించారు. కేసిఆర్ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లే స్మారక చిహ్నం ఏర్పాటుకు కృషి చేశారు. అంబేద్కర్ విగ్రహం, సెక్రటేరియట్ తో వేగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న అమరల స్మారక చిహ్నం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అమరవీరుల స్మారక చిహ్నాన్ని పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఫినిషింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియ తిరుగుతూ పనులు క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించారు. ప్రధాన ద్వారం, ల్యాండ్ స్కేప్ ఏరియా, పార్కింగ్ ఏరియా, తెలంగాణ తల్లి విగ్రహం, ఫౌంటైన్ ఏరియా, గ్రానైట్ ఫ్లోరింగ్, ఫోటో గ్యాలరీ, ఆడియో, విజువల్ రూం, లిఫ్ట్ లు, ఎస్కలేటర్, కన్వెన్షన్ సెంటర్, పై అంతస్థులో రెస్టారెంట్, నిరంతరం జ్వలించే జ్వాలలా ఉండే జ్యోతి ఆకృతి ఇలా అన్ని రకాల పనులు పరిశీలించారు మంత్రి. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశానుసారం అధికారులకు ,నిర్మాణ సంస్థ కు పలు సూచనలు చేశారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు ప్రతిబింబించేలా.. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగర నడిబొడ్డున,హుస్సేన్ సాగర్ తీరాన ఈ నిర్మాణం చేపట్టారని, అరుదైన స్టెయిన్ స్టీల్ తో అన్ని రకాల అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో,సకల హంగులతో స్మారకాన్ని నిర్మించామని తెలిపారు. ప్రపంచంలోనే అరుదైన స్టెయిన్ లెస్ స్టీల్ తో నిర్మించిన అతిపెద్ద కట్టడం ఇదేనని అన్నారు. ఈ నిర్మాణం పూర్తి అయి అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రపంచమే అబ్బురపడి చూస్తుందని చెప్పారు. స్మారక ప్రాంగణానికి ఎవరు వచ్చినా అమరవీరుల త్యాగాలు గుర్తు చేసుకునే విధంగా ఈ నిర్మాణంలో ఏర్పాట్లు ఉండబోతున్నట్లు తెలిపారు. ఇది పూర్తిగా యావత్ తెలంగాణ ప్రజల హృదయాలను హత్తుకునే కట్టడమని ప్రతి ఒక్కరూ మనసుపెట్టి పనిచేయాలని అధికారులను,వర్క్ ఏజెన్సీని కోరారు. ల్యాండ్ స్కేప్ ఏరియాలో పచ్చదనానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఆహ్లాదకరమైన రంగురంగుల పూల మొక్కలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ ఫినిషింగ్ పనుల్లో వేగం పెంచాలని, ప్లాన్ చార్ట్ ప్రకారం పనులు పూర్తి చేసి సీఎం కేసీఆర్ నిర్ణయించిన నిర్ణీత గడువులోగా ప్రారంభానికి సిద్దం చేయాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదేశించారు. అందుకు తగ్గట్టుగా మ్యాన్ పవర్ పెంచాలని సూచించారు.

# స్వల్పంగా తగ్గిన మద్యం ధరలు

**హైదరాబాద్ :**



మద్యం ప్రియులకు తెలంగాణ సర్కార్ అదిరిపోయే శుభావార్త చెప్పింది. తెలంగాణలో మద్యం ధరలు భారీగా తగ్గాయి. ధరలు తగ్గిస్తున్నట్లు శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. మద్యంపై రాష్ట్ర ప్రభుత్వం విధించే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో మద్యం ధరలు తగ్గిపోయాయి. బీర్ మినహా లిక్కర్‌కు చెందిన అన్ని బ్రాండ్లపై ధరలు తగ్గాయి. అధిక ధరలు కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఇకపై అలా ఉండకూడదని దీన్ని నియంత్రించేందుకు ధరలు తగ్గించినట్లు అధికారులు తెలిపారు.

**ధరలు తగ్గింపు ఇలా..**

క్వార్టర్‌పై : రూ.10 తగ్గింపు,హాఫ్‌పై : రూ.20 తగ్గింపు,ఫుల్‌పై : రూ. 40 చొప్పున ధరలు తగ్గాయి. మరోవైపు.. కొన్ని రకాల బ్రాండ్స్‌లో ఫుల్ బాటిళ్లపై 60 రూపాయిల వరకు తగ్గిస్తున్నట్లు అబ్కారీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాగా తగ్గిన ఈ ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే.. కరోనా లాక్‌డౌన్ తర్వాత ఆదాయాన్ని పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా మద్యం ధరలను పెంచిన సంగతి తెలిసిందే. దీంతో జనాలంతా పక్క రాష్ట్రాలకు వెళ్లి మరీ తెచ్చుకుంటూ ఉండటంతో అబ్కారీ అధికారులు పై నిర్ణయం తీసుకున్నారు.

# పొంగులేటి షరతులకు బీజేపీ తలొగ్గుతుందా ?

**ఖమ్మం:**



ఖమ్మం సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తమ పార్టీలో చేర్చుకోవాలి అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి రాహుల్ గాంధీ టీం వచ్చి చర్చలు జరిపింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న పది సీట్లలో రెండు తప్ప ఎనిమిది సీట్లు రాసిస్తామని హామీ ఇచ్చినట్లుగా ప్రచారం జరిగింది. కానీ ఆయన టెంప్ట్ అయ్యారో లేదో తెలియదు. తాజాగా బీజేపీ చేరిక కమిటీ కూడా చర్చలు జరిపింది. ఆయన కావాలనుకుంటే ఎనిమిది కాదు మొత్తం పది సీట్లు ఆయనకే ఇస్తామని ఆఫర్ చేశారన్న ప్రచారం జరుగుతోంది. కానీ బీజేపీలో లోకల్ లో ఇచ్చే ఆఫర్లకు వాలిడేషన్ ఉండదు. హైకమాండ్ నుంచి రావాల్సిందే. మరి పొంగులేటి ఏం చేయబోతున్నారు ?ఏడాదిగా పొంగులేటి అధికార బీఆర్ఎస్ కు దూరం జరుగుతూ వచ్చారు. తొలుత వైసీపీ టికెట్ పై ఖమ్మం ఎంపీగా గెలిచిన ఆయన 2019లో పోటీ చేయలేదు. తుమ్మల నాగేశ్వరరావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకుల ఓటమిలో ఆయనే కారణమన్న ఆరోపణల నడుమ పార్టీ అధిష్టానం ఆయన్ను దూరం పెట్టింది. గతేడాదిగా పొంగులేటి కేసీఆర్ ప్రభుత్వంపై పరోక్షంగానూ ప్రత్యక్షంగానూ విమర్శలు సంధిస్తూ వచ్చారు. తన అనుచరులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ వేరు మనం వేరు అన్న ఫీలింగ్ తీసుకొచ్చారు. ఒకటి రెండు చోట్ల తన వర్గం తరపున అభ్యర్థులను ప్రకటించి దూకుడును ప్రదర్శించారు. ఆయనకు అన్ని నియోజకవర్గాల్లో అనుచరగణం ఉండటంతో పార్టీలో చేర్చుకునేందుకు జాతీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. పొంగులేటి ఎన్నికల్లో ఎంతైనా ఖర్చు పెట్టగలరు. ఆయనకు కార్యకర్తల బలం కూడా ఉంది. ఖచితంగా చెప్పాలంటే ఒక జిల్లా మొత్తం ఆయన చేతిలో ఉంది. అక్కడ కాంగ్రెస్ కు బలముంది. కావాలనుకుంటే బీజేపీ కొంతైనా బలాన్ని పుంజుకోగలదు. అందుకే కాంగ్రెస్ బీజేపీ రెండు పార్టీలు ఆయనకు గాలం వేస్తున్నాయి. పైగా ఖమ్మం గడ్డ మీద నుంచి బీఆర్ఎస్ తరపున ఒక్కరిని కూడా అసెంబ్లీ గడప తొక్కనివ్వబోనని పొంగులేటి శపథం చేశారు. అదీ ఆయన పట్టుదలకు నిదర్శనమని భావిస్తున్న ఆ రెండు పార్టీలు పొంగులేటి తమ వర్గంలో ఉంటే బావుండునని ఎదురు చూస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన వెంటనే కాంగ్రెస్ నేతలు ఆయన్ను సంప్రదించారు. రాహుల్ గాంధీ టీమ్ నేరుగా ఆయన్ను సంప్రదించింది. ఇప్పుడు బీజేపీ టీమ్ కూడా బతిమాలుతోంది. పొంగులేటి తొందరపడ దలచుకోలేదు. కాంగ్రెస్ ముందు ఆయన కొన్ని షరతులు పెట్టారు. ఈ షరతులపై ఖమ్మం జిల్లా సీనియర్ నేతలు భట్టి విక్రమార్క రేణుకా చౌదరి అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ముందు పార్టీలో చేరాక టికెట్ల విషయం చూద్దామని వాళ్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. బీజేపీ అధిష్టానం కూడా తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో పొంగులేటి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. పొంగులేటి రెడ్డి సామాజికవర్గం నేత కావడంతో ఆయన ప్రాబల్యం ఖమ్మం జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం మొత్తం ఉంటుందని బీజేపీ లెక్కగడుతోంది. కాకపోతే పొంగులేటి డిమాండ్లను నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉండాలి. కానీ బీజేపీ పెద్దలు ఇలాంటి ముందస్తు షరతులకు అంగీకరించరు. అందుకే పార్టీలో చేరికలు తేడా పడుతున్నాయి. చివరికి గెలిచే పార్టీలోకి వెళ్లాలని పొంగులేటి గట్టిగా అనకు?నే అవకాశం ఉంది. అందుకే రాజకీయ పరిణామాల్ని బట్టి ఆయన పార్టీని ఎంచుకునే చాన్సులున్నాయి. ఎందుకంటే... ఇప్పుడు ఆయనకే ఆప్షన్లు ఉన్నాయి మరి !

# ఎలక్షన్ వేడి షురూ....

**హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాలు ఎన్నికలకు ముందే హీటెక్కుతున్నాయి. అన్ని పార్టీలు ఎన్నికల రంగంలోకి దిగాయి. ఇక.. అభ్యర్థుల విషయంలో ఒకడుగు ముందుకేసిన బీఆర్ఎస్.. ఇటీవల ఎమ్మెల్యే టికెట్లు విషయంలో క్లారిటీ ఇస్తూ వస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో కేసీఆర్‌తోపాటు మంత్రి కేటీఆర్ కూడా ఫోకస్ పెంచారు. పలు చోట్ల ఏకంగా క్యాండేట్లను ప్రకటించేస్తున్నారు. మొన్నామధ్య హుజురాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కౌశిక్‌రెడ్డిని ప్రకటించి.. అక్కడ సస్పెన్స్‌కు తెరదించారు. తాజాగా.. మరో ఇద్దరు అభ్యర్థులను డిక్లేర్ చేశారు మంత్రి కేటీఆర్. హుస్నాబాద్‌లో పర్యటించిన కేటీఆర్.. ఎమ్మెల్యే అభ్యర్థిగా వీ.సతీష్‌ను ప్రకటించారు. ఇక.. హుస్నాబాద్ సభలోనే మరో స్పష్టత ఇచ్చారు మంత్రి కేటీఆర్. కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వినోద్‌కుమార్ పోటీ చేస్తారని చెప్పారు. మంచి మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు? ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. వరంగల్ పశ్చిమలో జరుగుతున్న రాజకీయ ప్రచారాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి పోటీ చేసేది దాస్యం వినయ్ భాస్కరేనని క్లారిటీ ఇచ్చారు. ఈసారి రికార్డుస్థాయి మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు మంత్రి కేటీఆర్. మొత్తంగా..బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నుంచి ఎవరు పోటీ చేస్తారనేదానిపై కొన్నిరోజులుగా సందిగ్ధత నెలకొంది. అంతేకాదు.. వినోద్ ఎమ్మెల్యేగా పోటీచేస్తారని కూడా వార్తలు వచ్చాయి. అయితే.. కేటీఆర్ తాజా ప్రకటనతో ఫుల్ క్లారిటీ వచ్చేసింది. అటు.. హుస్నాబాద్‌తో పాటు వరంగల్ పశ్చిమ సీటుపై స్పష్టత ఇచ్చేశారు కేటీఆర్. రాబోయే రోజుల్లో ఎన్నికలకు ముందే.. కేటీఆర్.. ఇంకెవరెవరిని ప్రకటిస్తారో చూడాలి.

# అన్నమయ్య గొప్ప సామాజిక సంస్కర్త

**కాకినాడ**

ఆనాటి సాంఘిక విశేషాలు, ఆచారాలు, ప్రజల జీవన విధానాలపై సంకీర్తన చేసిన అన్నమయ్య ధన్యుడని నాట్య మయూరి, నృత్య కౌముది, సిరిమువ్వ ఎన్. సి హెచ్. లక్ష్మి శాంతి పేర్కొన్నారు .రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద కవితా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన అన్నమయ్య తొలి తెలుగు వాగ్గేయకారుడని అన్నారు. తన జీవితాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి కైంకర్యానికి అంకితం చేసిన ధన్యజీవని అన్నారు. అనేక సంప్రదాయాల్లో రచనలు చేసి తర్వాత పదకర్తలకు మార్గదర్శకుడు అయ్యారని లక్ష్మి శాంతి తెలిపారు . ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ జాతి, మత, కులాన్ని విడనాడాలని, మనుషులంతా సమానమేనని అన్నమయ్య తన కీర్తనల ద్వారా తెలిపారని అన్నారు . ఈ సందర్భంగా గాయని అరబి అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో లక్ష్మి శాంతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు , రేలంగి బాపరాజు, రాజా, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ఆకర్ష్ మంత్రమే తంత్రమా

**హైదరాబాద్,:**

శత్రువుకు శత్రువు మిత్రుడనే సామెత తెలంగాణ రాజకీయాలకు సరిగ్గా సరిపోతుంది. ఈ ఏడాది తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీఆర్ఎస్ పై అసంతృప్తితో ఉన్న సీనియర్ నేతలను ఆపరేషన్ ఆకర్ష్ పేరిట తమ పార్టీల్లోకి ఆహ్వానిస్తున్నాయి. తాజాగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఈటల రాజేందర్ నేతృత్వంలో బీజేపీ చేరిక కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఇటీవల పొంగులేటి, జూపల్లిని బీఆర్ఎస్ అధిష్ఠానం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ ఇద్దరు నేతలతో బీజేపీ నేతలు సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ నేతలతో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రఘునందనరావు సంప్రదింపులు జరపడం బాగానే ఉన్నా... ఈ తంతు తెలంగాణ బీజేపీ అగ్రనాయకులు తెలియకపోవడం పార్టీలో లుకలుకలను బయటపెట్టాయి. ఖమ్మంలో పొంగులేటి, జూపల్లితో చర్చల సమాచారం తనకు తెలియదని తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ చెప్పడంతో...ఇన్నాళ్లు అంతర్గతంగా ఉన్న విభేదాలను ఇప్పుడు బయటపడ్డాయి. పార్టీలో చేరికలకు గేట్లు తెరిచే ఉన్నాయని బీజేపీ చేరికల కమిటీ సభ్యులు పదే పదే చెబుతున్నా... కీలక నేతలు చేరకపోవడంతో బీజేపీ అధిష్ఠానం ఈ కమిటీపై అసంతృప్తితో ఉందని తెలుస్తోంది. తెలంగాణలో బీజేపీకి అనుకూల పవనాలు విస్తున్నాయని చెబుతున్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి అంతగా ఫిరాయింపులు లేకపోవడంతో చేరికల కమిటీ వైఫల్యం చెందిందని పార్టీ నేతలు అనుకుంటున్నారని సమాచారం.అయితే కేసీఆర్ ను ఎదుర్కొనేందుకు బీజేపీ ఉపయోగిస్తున్న ట్రంప్ కార్డు తానేనని ప్రచారం చేసుకున్న ఈటల రాజేందర్... ప్రస్తుతం వీలర్-డీలర్ స్థాయికి పడిపోయారు. మొదట్లో తనను తాను బీజేపీ జెండా మోసిన వ్యక్తిగా ప్రమోట్ చేసుకున్న ఈటల, కేసీఆర్ కు వ్యతిరేకంగా ట్రంప్ కార్డ్‌గా తనను తాను ప్రదర్శించుకున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి నేతలను బీజేపీ షిఫ్ట్ చేసే ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఒక రకమైన "వీలర్-డీలర్" స్థాయికి పడిపోయారని వ్యంగ్యాస్త్రాలు వినిపిస్తున్నాయి. టీబీజేపీ ఫిరాయింపుదారులకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని అంచనా వేసినప్పటికీ, కాంగ్రెస్ రాజగోపాల్ రెడ్డి మినహా, ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులు జరిగే సంకేతాలు పెద్దగా కనిపించడంలేదు. బీజేపీ చెబుతున్నట్లు చాలా అనుకూలమైన పరిస్థితులు ఉన్నా బీఆర్ఎస్ నుంచి ఇప్పటి వరకూ ఫిరాయింపులు జరగకపోవడం చాలా విచిత్రం అంటున్నారు విశ్లేషకులు.కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఈటల రాజేందర్ బీజేపీలోకి ఫిరాయించడం, ఆ తర్వాత ఎన్నికల్లో విజయం సాధించడంతో... ఇక అసంతృప్త నేతలంతా బీజేపీకి క్యూ కడతారని భావించారు. కానీ బీజేపీ ఇచ్చిన ఝలక్ తో బీఆర్ఎస్ అలెర్ట్ అయినట్లు తెలుస్తోంది. ఈటల తర్వాత బీఆర్ఎస్ నుంచి పెద్ద ఫిరాయింపులు లేవు. కేసీఆర్‌ను అధికారం నుంచి దింపేందుకు ఇదే మంచి ప్రత్యామ్నాయమని ప్రచారం సాగుతున్నప్పటికీ, పార్టీ ఫిరాయింపుదారులతో ఒప్పందం కుదుర్చుకోవడంలో బీజేపీ చేరికల కమిటీ విఫలమైందనేది వాస్తవం. ఇది టీబీజేపీకి గట్టి ఎదురుదెబ్బ.ఒకప్పుడు మిత్రపక్షంగా ఉన్న కేసీఆర్‌ను గద్దె దించాలన్న బీజేపీ ఆశయాలు ఉపఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపొందడంతో మొదలైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 4 స్థానాలను గెలుచుకోవడం తెలంగాణలో బీజేపీ ఆశలకు ఆజ్యం పోసింది.అప్పటి నుంచి తెలంగాణలో యాక్టివ్ అయింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించడంతో పాటు తరచూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించడం... బీజేపీ అగ్రనాయకత్వం తెలంగాణపై దృష్టిసారించడం మొదలైంది. ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ప్రచారానికి జాతీయ నాయకత్వం నేతలను మోహరిస్తుండడం చూస్తుంటే.. కేసీఆర్ ఎత్తుగడలకు సరిపడేలా టీబీజేపీ లేదన్న పరిస్థితికి నిదర్శనం. ఆ పార్టీకి ప్రాతినిధ్యం వహించడానికి సముచితమైన, ప్రజాదరణ పొందిన నేత ఎవరూ లేరన్నది వాస్తవం. ఫిరాయింపులను ప్రోత్సహించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినా... అది స్టోర్ ముందు భాగంలో "హెల్ప్ వాంటెడ్" సైన్ బోర్డులా మిగిలిపోయింది.బీఆర్ఎస్ ప్రత్యామ్నాయంగా బీజేపీ ఆవిర్భవించాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఫిరాయింపుదారులను ఆకర్షించే ప్రయత్నం, ఆ దిశగా వీలర్-డీలర్ల కమిటీని ఏర్పాటు చేయడం కేసీఆర్‌ను గద్దె దింపడానికి ఎంతమాత్రం పనికాదని ప్రతిబింబిస్తోంది.మరోవైపు బీఆర్ఎస్ నుంచి ఫిరాయింపులపై బీజేపీ ఆడుతున్న మైండ్ గేమ్‌లు కేసీఆర్‌కు ఒక సవాల్ విసురుతున్నా... కేసీఆర్ మాత్రం నరేంద్ర మోదీ విధానాలపై విరుచుకుపడుతున్నారు. మీకు వీలైతే నా నుండి చాలా మందిని దోచుకోండని కేసీఆర్ బహిరంగంగా సవాల్ చేస్తున్నారు.ఒకవేళ బీఆర్ఎస్ అసంతృప్తుల బీజేపీకి ఫిరాయించినా అవి కేసీఆర్‌కు చిన్నపాటి అవాంతరాలుగా ఉంటున్నాయి. కానీ ఆ నేతలు బీజేపీకి భారంగా మారుతున్నారు. ఈటల రాజేందర్ లాగా ఉన్న పలుకుబడితో గెలిచే స్థాయి ఇతర నేతల్లో లేకపోవడంతో బీజేపీకి పెద్ద చిక్కులా మారింది. అంతేగాక ఖమ్మంలో బీజేపీ చేరికల కమిటీ చర్చలు జరుపుతున్న నేతలు... స్థానికంగా పేరున్న నాయకులే అయినా, వారిని పార్టీలో చేర్చుకుంటే బీజేపీ లక్ష్యాలు నెరవేరతాయా అనే సందేహం లేకపోలేదు.కేసీఆర్‌ను గద్దె దింపేందుకు ఫిరాయింపుదారులపై ఆధారపడితే టీబీజేపీకి పెద్ద సవాలే అవుతుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కమలం పార్టీని నిలబెట్టేందుకు దశాబ్దాలుగా పోరాడిన బీజేపీ కురువృద్ధుడు ఒకరు ఈ విషయంపై నిరాశ వ్యక్తం చేశారు. కేసీఆర్ రెండు పర్యాయాలలో అధికార వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ, కుటుంబ అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నప్పటికీ... కేసీఆర్ కు ఉన్న పాపులారిటీ ముందు బీజేపీ, ఫిరాయింపుదారుల ఆదరణ సరిపోతుందా? అనే సందేహం వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా... ఫిరాయింపులను ప్రేరేపించే ప్రయత్నాలు, నిరుద్యోగ యువతలో అసంతృప్తి, నరేంద్ర మోదీ ఇమేజ్, కేసీఆర్ ఫ్యామిలీపై అవినీతి ఆరోపణలు, హిందుత్వ కార్డ్ బీజేపీ కేవలం ఒక ముఖద్వారం మాత్రమే. కేసీఆర్ పార్టీ నుమంచి సస్పెండ్ చేసిన నేతలతో డీల్ కుదుర్చుకునేందుకు బీజేపీ చూపించిన తెగువ కేసీఆర్ ను ఎదుర్కోవడంలో అవసరమని విశ్లేషకులు అంటున్నారు. మరీ ముఖ్యంగా ఫిరాయింపుదారులను రంగంలోకి దింపి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా విఫలమైంది. ఆ ఎదురుదెబ్బల నుంచి ఇంకా గుణపాఠం నేర్చుకోకుండా మళ్లీ అదే ఫార్ములాను తెలంగాణలో అమలుచేస్తున్నట్లు కనిపిస్తుంది.కేసీఆర్ రెండేళ్ల పాలనపై బలమైన వ్యతిరేకత ఉందనడంలో సందేహం లేదు. కేసీఆర్‌ను తెలంగాణ ఐకాన్ నుంచి అవినీతి కుటుంబ పాలకుడిగా చిత్రీకరించడం, బీఆర్ఎస్ స్టీరింగ్ ఒఎఓఎఓ చేతిలో ఉందని ప్రచారం చేయడంలో బీజేపీ సక్సెస్ అయింది. అధికార పార్టీపై వ్యతిరేకతను గ్రహించిన కేసీఆర్ ... కౌంటర్ ప్లాన్ రెడీ చేసుకున్నారు. అందుకోసం తెలంగాణ ఉప జాతీయవాదం వర్సెస్ బీజేపీ జాతీయవాదాన్ని తెరపైకి తీసుకువచ్చారు.బీజేపీ జాతీయవాదానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉపజాతివాదాన్ని కేసీఆర్ కొత్త వ్యూహంగా తెలంగాణ ఓటర్లు భావిస్తున్నారు. బీజేపీని ఇరకాటంలో పెట్టడానికి కేసీఆర్ రచించిన కొత్త వ్యూహంతో మళ్లీ సెంటిమెంట్ ను రగిల్చేందుకు చూస్తున్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రానికి, సెంటిమెంట్‌కు ఏదైనా ముప్పు ఉందని తెలంగాణ వాసులు భావిస్తే మళ్లీ ఉద్యమానికి సిద్ధంగా ఉంటారు.కేసీఆర్ పై పోరాడడానికి ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన పాత, కొత్త నాయకులు, ఫిరాయింపుదారులు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు, బీఆర్ఎస్ నుంచి తొలగించిన నేతలను ఏకం చేయాలని చూస్తే బీజేపీకి పశ్చిమ బెంగాల్ ఫలితమే రిపీట్ అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. వీటన్నింటిని కప్పిపుచ్చుకుని కాంగ్రెస్, ఇతర పార్టీలను తట్టుకుని బీజేపీ తనను తాను ఎలా ఆవిష్కరించుకుంటుందో... సొంత ఓట్లను వృధా చేయకుండా, అధికార పార్టీ వ్యతిరేక ఓటర్లను తనవైపు ఎలా తిప్పుకుంటుందో వేచిచూడాలి. అందువల్ల బీఆర్ఎస్ ఫిరాయింపుదారుల బలంతో గెలవాలని ప్లాన్ చేయడం... బీజేపీ అసలు బలాన్ని విస్మరించి చేసే ప్రమాదకర ప్రతిపాదన అవుతుంది

# ఆర్టీసీ బస్సుపై రాళ్ల దాడి

**కరీంనగర్ :**

జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తెల్లవారుజామున ఆర్టీసీ బస్సుపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.హుజురాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రోజూలాగానే తెల్లవారు జామున నిజామాబాద్ నుంచి వరంగల్ కు బయలు దేరింది. అందులో మొత్తం 75 మంది ప్రయాణికులు ఉన్నారు. సాఫీగా సాగుతున్న ప్రయాణంలో ఊహించని అపాయం ముంచుకొచ్చింది. జగిత్యాల మంచినీళ్లబావి సమీపానికి రాగానే ఒక్కసారిగా రాళ్లుతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ప్రయాణికులకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. వెనుక నుంచి రాళ్లు విసరటంతో బస్సు అద్దాలు పగిలి మెట్‌పల్లికి చెందిన ఓ ప్రయాణికుడికి తీవ్రంగా గాయపడ్డాడు. బస్సులో 75 మందిప్రయాణిస్తున్నట్లు బస్సు కండక్టర్ తెలిపారు. బస్సు వెనుక నుంచి అనుసరిస్తున్న యువకులు దాడిచేసి పారిపోయారని కండక్టర్ పేర్కొన్నారు. డ్రైవర్, కండెక్టర్ అప్రమత్తమై బస్సును పక్కనే ఆపారని ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఒకరికి తీవ్ర గాయాలు కాగా.. పలువురికి స్వల్ప గాయాలయ్యాయని పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్ పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. బస్సుపై రాళ్లదాడి చేసిన వ్యక్తి ఎవరు? మద్యం సేవించి రాళ్లదాడి చేశాడా? లేక బస్సులు వాళ్లకు సంబంధించిన వారిపై రాళ్లదాడి చేసి ఉంటాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పోయిన చోటే వెతుక్కోవాలన్న పొంగులేటి ప్లాన్

## తెలంగాణ రైతు సమాఖ్య(టిఆర్ఎస్) పేరుతో కొత్త వేదికను సిద్ధం

**హైదరాబాద్ :**

పోయిన చోటే వెతుక్కోవాలన్న సామెతను తూచా తప్పకుండా పాటించేలా ప్లాన్ చేస్తున్నారు బీఆర్ఎస్ మాజీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి. తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి తెర మీదకు తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ (పొట్టిగా పలికితే ఈ పేరు.. వివరంగా చూస్తే తెలంగాణ రాష్ట్ర సమితి) ను మార్చి బీఆర్ఎస్ గా మార్చటం తెలిసిందే. ఈ మధ్యనే బీఆర్ఎస్ నుంచి వేటుపడి బయటకు వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కేసీఆర్ బాధితులుగా మారిన నేతల్ని ఒక వేదిక మీదకు తీసుకురావటం.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి.. తర్వాతి కాలంలో అడ్రస్ లేకుండా చేసిన కేసీఆర్ బాధితుల్ని కలిపేందుకు వీలుగా టీఆర్ఎస్ (తెలంగాణ రైతు సమాఖ్య) పేరుతో కొత్త వేదికను సిద్ధం చేస్తున్నారు.
దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నికల కమిషన్ వద్ద ఒక రాజకీయ పార్టీ నమోదైంది కూడా. దీన్ని పొంగులేటి అనుచరులే రిజిస్టర్ చేయించినట్లు చెబుతున్నారు. ఈ పార్టీని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటికి తెర మీదకు తీసుకొచ్చి.. దాదాపు 45 స్థానాల్లో తన అనుచరులను బరిలోకి దించేందుకు వీలుగా పొంగులేటి ప్లానింగ్ చేసినట్లుగా చెబుతున్నారు. దీనికి సంబంధించి ఆయన ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారని చెబుతున్నారు.
ఖమ్మం.. మహబూబ్ నగర్.. నల్గొండ.. వరంగల్ జిల్లాలకు చెందిన పలువురిని పార్టీలోకి చేరేందుకు వీలుగా కసరత్తు పూర్తి చేశారంటున్నారు. ఇప్పటివకు పరిమిత సంఖ్యలో మాత్రమే తెలిసిన సరికొత్త టీఆర్ఎస్ ను.. ఓపెన్ గా ప్రకటించేసి.. దానిక స్వరూపం గురించి పొంగులేటి వివరిస్తారని చెబుతున్నారు. మొత్తం 45 స్థానాల్లో పోటీ చేసి 15 స్థానాల్ని సొంతం చేసుకోవటమే తమ లక్ష్యమని పొంగులేటి తన సన్నిహితులతో చెబుతున్నట్లుగా తెలుస్తోంది.



ఈ ప్లాన్ లో భాగంగా కేసీఆర్ బాధితుల్ని ఒక చోటుకు చేర్చాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఇన్ ఛార్జిగా మజీ మంత్రి జూపల్లి.. నల్గొండ జిల్లాకు చకిలం అనిల్ కుమార్.. వరంగల్ జిల్లా బాధ్యతను తన వియ్యంకుడైన మాజీ ఎంపీ రామ సహాయం సురేందర్ రెడ్డి కొడుక్కి అప్పగించినట్లుగా చెబుతున్నారు. ఉమ్మడి అదిలాబాద్.. కరీంనగర్ జిల్లాలకు సంబంధించి సరైన నేతల కోసం వెతుకులాట సాగుతోంది.
పార్టీ పేరు విషయంలో గులాబీ బాస్ కు షాకిచ్చేలా ప్లాన్ చేసినప్పటికీ.. పార్టీకి కామన్ సింబల్ ను ఎన్నికల కమిషన్ నుంచి పొందటం కష్టంగా ఉంటుందన్న మాట వినిపిస్తోంది. ఐదారు నెలల్లో జరిగే ఎన్నికల్లో పొంగులేటి పార్టీకి కామన్ సింబల్ సమస్యగా మారుతుందన్న మాట వినిపిస్తోంది. కోదండరాం పార్టీ తెలంగాణ జనసమితికి అలాంటి సమస్యే ఎదురైంది. ఈ నేపథ్యంలో కామన్ సింబల్ ను సాధించేందుకు వీలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సంబంధించినకీలక ప్రకటన ఈ నెల 15న తీసుకోనున్నట్లు చెబుతున్నారు. ఏమైనా.. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన టీఆర్ఎస్ పేరును వదిలేయటం ద్వారా తనకు ఎంత నష్టం వాటిల్లిందన్న విషయాన్ని కేసీఆర్ కు అర్థమయ్యేలా చేయాలన్న పట్టుదలతో ఉన్నట్లు చెబుతున్నారు. మరీ ప్లానింగ్ ఎంతవరకు వర్కువుట్ అవుతుందో తేలాలంటే మరికొంత కాలం వెయిట్ చేయక తప్పదు.

# అధికారికం8వేలు- అనధికారికం 20 వేలు

**విశాఖపట్టణం:**

సింహాచలం చందనోత్సవంలో జరిగిన గందరగోళం అంతా ఇంతా కాదు. ఇప్పుడు విచారణలో కూడా అదే రచ్చ.. బాధ్యత మీదంటే మీదని అటు పోలీసులు.. ఇటు దేవాదాయ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అయితే ఇది పూర్తిగా దేవాదాయ శాఖ అధికారుల వైఫల్యమేనని, 8000 అంతరాలయం టికెట్లు ఇస్తామని 20వేల వరకు ముద్రించారని అందులో పెద్ద స్కాం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కానీ విచారణ మాత్రం ఇంకా నత్తనడకనే సాగుతోంది.. సింహాద్రి అప్పన్న.. ఏంటి సామీ ఇది..సింహాద్రి అప్పన నిజరూప దర్శనం అంటే ఉత్తరాంధ్ర వాసులకు పెద్ద పండగే.. ఏడాదిలో ఒక్కరోజే శ్రీ వరాహ నరసింహస్వామి భక్తులకు నిజరూప దర్శనం ఇస్తాడు. ప్రభుత్వాలు కూడా దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకమైన రోజుగా భావించి ఆ మేరకు ఏర్పాట్లు చేపడతాయి. లక్షలాది మంది భక్తులు వచ్చే సందర్భం కాబట్టి రెవెన్యూ, పోలీస్, ఫైర్, పురపాలక, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, లాంటి అనేక డిపార్ట్మెంట్ల సహకారంతో దేవాదాయ శాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటుంది.దశాబ్దాలుగా జరుగుతున్న ప్రక్రియ కాబట్టి ఎంతమంది భక్తులొస్తారు..దర్శనానికి ఎంత సమయం పడుతుంది? ఎన్ని కేటగిరీలుగా విభజించాలి?. ఏ ఏ కేటగిరీలను ఎటునుంచి పంపాలి? లాంటి అనేక అంశాలతో పదుల సంఖ్యలో సమన్వయ కమిటీల సమావేశాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా అలానే సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి..కానీ నిజరూప దర్శనం నాడు మాత్రం ఆ ఐకమత్యం కనిపించలేదు..భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇక, అంతరాలయ దర్శనాల గందరగోళం అయితే అంతా ఇంతా కాదు. సాధారణంగా ఉత్సవ నిర్వహణ అంతా దేవాలయ శాఖ చేస్తూ ఉంటుంది ముందుగా జరిగే సమన్వయ కమిటీ సమావేశాల్లో నిర్ణయించుకున్న బాధ్యతల మేరకు ఇతర శాఖలు ఇన్వాల్వ్ అవుతాయి పోలీసులు యధావిధిగా భక్తులకు భద్రత క్యూలైన్లో తొక్కిసలాట లాంటివి జరగకుండా చూడ్డం.. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం జరిగేలా చూసే బాధ్యతలు నిర్వహిస్తుంటారు కార్యక్రమం నిర్వహణ పేరుకి దేవాదాయ శాఖ అయినప్పటికీ రెవెన్యూ శాఖ పెద్దన్న పాత్ర పోషిస్తుంది అందులోనూ ఈ ఉత్సవ కమిటీకి జిల్లా కలెక్టరే స్వయంగా చైర్మన్ కూడా కావడంతో రెవెన్యూ అధికారులకు కనీసంలోనే దేవాదాయ శాఖ ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటుంది? అయితే తాజాగా జరిగిన గందరగోళానికి సంబంధించి జిల్లా కలెక్టర్ విచారణ అధికారిగా జాయింట్ కలెక్టర్ ని నియమించారు జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్ ఉద్యోగులందరినీ కలెక్టరేట్కు పిలిపించి మరీ ఒక్కొక్కరిని విచారిస్తూ వాళ్ల నుంచి స్టేట్మెంట్స్ కూడా తీసుకున్నారు.. అయితే దేవాదాయ శాఖ ఉద్యోగులంతా ఈ వైఫల్యానికి కారణం పోలీసులని చెబుతున్నారట.. క్యూలైన్ల వద్ద జనాలను నియంత్రించాల్సిన పోలీసు అధికారులు మెహర్బానీ కోసం తమకు తెలిసిన వాళ్ళకి దర్శనం కలిగించడం కోసం క్యూ లైన్లను పక్కనపెట్టి ప్రత్యేక గేట్లను ఓపెన్ చేయడం ద్వారా వందలాదిగా అటువైపుగా వచ్చారని వాళ్లంతా అంతరాలయంలో చొరబడి ఎక్కువ సేపు ఉండడంతో ఈలోపు బయట ఆగిపోయిన వాళ్ళు ఆగిపోయారని స్వయంగా నగర మేయరే రెండు గంటల పాటు క్యూ లైన్ లో వేచి ఉండి దర్శనం చేసుకోగా ఇక స్వరూపానంద స్వామి కి కూడా దాదాపుగా అలాంటి చేదు అనుభవాలు ఎదురవడంతో ఆయన నేరుగా బయటకు వచ్చి కార్యక్రమం నిర్వాహకులపై తీవ్రంగా విరుచుక పడ్డారు. అది పెద్ద సంచలనమే అయింది.ఇక మంత్రి బొత్స కూడా తనను నిలదీసిన భక్తులకు నాకే మూడు గంటల సమయం పట్టిందని కాసేపు వేచి ఉండాలని కోరడం కనిపించిందనీ వీటన్నింటికీ కారణం పోలీసులే అని దేవాదాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారట. ట్రాఫిక్ నియంత్రణ కూడా సరిగా చేయలేదని అందువల్లే ఘాట్ పై ట్రాఫిక్ గంటల పాటు నిలిచిపోయిందని దానివల్ల భక్తుల్లో మరింత అసహనం పెరిగిపోయిందని అది కోపం రూపంలో బయటకు వచ్చి ప్రభుత్వం పై విమర్శలకు దారి తీసింది అన్నది దేవాలయ శాఖ అధికారుల వాదమ రోవైపు దేవాదాయ శాఖ అధికారులు తీరుపై పోలీసులు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారట. అసలు దేవస్థాన కార్య నిర్వహణ అధికారి అంతరాలయం లోపలే ఉండి రాజకీయ నాయకులకు దర్శనాలు చేయిస్తూ ఆగిపోవడం వల్ల బయట గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని వాటిని సమన్వయం చేయాల్సిన కీలకమైన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇలాంటి దుస్థితి వచ్చిందని పోలీసు అధికారులు నివేదిక ఇచ్చారట.అసలు అంతరాలయ దర్శనానికి 6000 మందికి అని చెప్పి.. ఆ తర్వాత ఎనిమిది వేలు చేశారట.. 20 వేలకు పైగా అంతరాలయ దర్శన పాసులు వచ్చాయని వాటిని తీసుకుని చించి భక్తులకు తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత ఎండోమెంట్స్ అధికారులదే అయినప్పటికీ వాళ్లు ఎవరు ఆ పని చేయకపోవడం వల్ల ఆ టికెట్స్ రీసైకిలై మళ్లీ మళ్లీ జనం దర్శనానికి వచ్చారని ఇదే ప్రధాన కారణం అన్నది పోలీసుల వాదన. అసలు అంతరాలయ పాసుల కోసం ముద్రించిన వాటిలో అనేకం నకిలీవి ఉన్నాయని అందులో పెద్ద స్కాం జరిగినట్టుగా ఉందన్నది పోలీస్ అధికారుల అనుమానం. అయితే దానిపై విచారణ చేయాలన్నా దేవాదాయ శాఖ మాత్రమే ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ దేవాలయ శాఖ అలాంటి ఫిర్యాదు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. మరొకవైపు పోలీసుల్నే బ్లేమ్ చేస్తూ ఉండడంతో దీన్ని సుమోటాగా తీసుకుని అయినా విచారించాలన్న ఆలోచనలో పోలీస్ అధికారులు ఉన్నట్టు సమాచారం.

# దుష్ట శక్తులు ఏవో ప్రజల వద్దే తేల్చుకుందాం...రా..

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన భూములపై బహిరంగ చర్చకు సిద్ధం**

**దుష్ట రైతు సంఘాల శక్తులు అనడం రైతాంగాన్ని అవమానపరచడమే-- బొజ్జా దశరథరామిరెడ్డి**

**నంద్యాల**

మెడికల్ కాలేజి ఏర్పాటుపై ప్రభుత్వ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతించిందని అయితే ప్రాంతీయ వ్యవసాయ భూములలో ఏర్పాటును వ్యతిరేంకించామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ...రైతాంగ అభివృద్ధికి దోహదపడటమే గాక భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం భూములలో మెడికల్ కాలేజి ఏర్పాటు చేస్తారన్న వార్తాల నేపథ్యంలో స్థానిక



ప్రజా ప్రతినిధులను వ్యక్తిగతంగా కలిసి ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలని కోరామని అయితే వారి నుంచి ఏ స్పందన లేకపోవడంతో ఆర్ ఏ ఆర్ ఎస్ ను కాపాడుకునేందుకు రైతులు కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధి దుష్ట రైతు సంఘాల శక్తులు అడ్డుకుంటున్నాయని ప్రకటన చేయడం రైతాంగాన్ని అవమానపరచడమేనని, దుష్ట శక్తులు ఏవో ప్రజల వద్దే తేల్చుకుందామని ఈ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమని దశరథరామిరెడ్డి సవాల్ చేసారు.ఈ విషయంపై పూర్తి సమాచారం కొరకు చిత్రంలోనూ, వీడియో లోనూ వీక్షించగలరు. ఈ కార్యాలయంలో మహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర నాయుడు, ఏరువ రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు ప్రైవేట్ సెక్రటరీగా శరద్ మర్కడ్ బాబాసాహెబ్

**హైదరాబాద్ :**

రాజకీయ పార్టీలే ప్రభుత్వాలను ఏర్పాటు చేసి నడిపిస్తున్నా పార్టీ వ్యవహారాలు, గవర్నమెంట్ కార్యకలాపాలు వేర్వేరు. అధికారం చేతుల్లో ఉంది కదా అని పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకోవడానికి వీల్లేదు. మరి సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఓ నియామకం విషయంలో పార్టీ కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకున్నారా? అనే సందేహాలకు, విమర్శలకు తావిచ్చింది ఓ పరిణామం. ఇలా చేయడం సబబేనా? అనే ప్రశ్నలకు కారణమవుతోంది. " తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రైవేట్ సెక్రటరీగా శరద్ మర్కడ్ బాబాసాహెబ్‌ను ప్రభుత్వం నియమించింది. రెండేళ్లకాలానికి జరిగిన ఈ నియామకం 1 మే 2023 నుంచి అమల్లోకి వచ్చింది. అతడికి నెలకు రూ.1,50,000 వేతనం చెల్లించబడుతుంది. ఈ వ్యయం జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లించబడుతుంది" అని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వు వెలువరించింది. సంబంధిత శాఖకు, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌కు విషయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి 2 మే 2023న ఈ సర్క్యులర్ జారీ చేశారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా.. కేసీఆర్ ప్రైవేటు సెక్రటరీగా నియామకమైన వ్యక్తి శరద మర్కడ్ బాబాసాహెబ్ విషయంలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణం ఏంటా అని ఆరా తీస్తే ఆసక్తికర విషయాలు తెలిశాయి.

**అసలు విషయం ఇదీ...**



సీఎం కేసీఆర్‌కు ప్రైవేట్ సెక్రటరీగా నియమితుడైన శరద్ మర్కడ్ బాబాసాహెబ్.. మహారాష్ట్రలోని అహ్మద్ నగర్‌కు చెందిన వ్యక్తి. ఏప్రిల్ 10న బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంటే బీఆర్ఎస్‌లో చేరిన 20 రోజులకే ప్రైవేటు సెక్రటరీగా అతడి నియామకం జరిగింది. దీంతో పార్టీ చేరిలో చేరిన వ్యక్తికి సీఎంవోలో ఉద్యోగం వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తరపున నియమించుకొని పార్టీ వ్యవహారాలకు వాడుకుంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకంపై టీపీసీసీ రేవంత్ రెడ్డి కూడా ఘాటుగానే స్పందించారు. పక్క రాష్ట్రంలో పరపతి కోసం ఇక్కడ ఉద్యోగం ఇచ్చారని, రాష్ట్రానికి చెందిన యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదుగానీ పొరుగు రాష్ట్రాలవారికి ఉద్యోగాలు ఇస్తున్నారని మండిపడ్డారు. కాగా మహారాష్ట్రకు చెందిన శరద్ మర్కడ్ బాబాసాహెబ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకొని మరీ బీఆర్ఎస్‌లో చేరారని బీఆర్ఎస్ అనుకూల మీడియాలో వార్తలు వచ్చాయి. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన శరద్ మర్కడ్.. రైతుల దోపిడిని చూస్తూ పెరిగారని, కేసీఆర్ విధానాలు నచ్చి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా మహారాష్ట్రలో పార్టీని క్రియాశీలకంగా మార్చాలని బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ భావిస్తున్నారు. ఇప్పటికే అక్కడ పలు మీటింగ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు పార్టీలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. అన్ని విధాలా అక్కడి జనాలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే పార్టీలో చేరిన మహారాష్ట్ర వ్యక్తికి సీఎంవోలో ఉద్యోగం వచ్చిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విమర్శలకు బీఆర్ఎస్ ఎలాంటి సమాధానం చెబుతుందో వేచిచూడాలి.

# జిఓ నంబర్ 58, 59, ఆసరా పెన్షన్ లు, దళిత బంధు అమలు పై సమీక్ష

**హైదరాబాద్ :**

ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన కాన్ఫరెన్స్ హాల్ లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హోంమంత్రి మహమూద్ అలీ తో కలిసి నగరానికి చెందిన ఓఎఅ లు, ఓఎం లు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఊ 58, 59, ఆసరా పెన్షన్ లు, దళిత బంధు ఇతర కార్యక్రమాల అమలు పై సమిక్ష నిర్వహించారు. ఊ 58 క్రింద వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి పట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న పట్టాలను వారం రోజుల్లోగా పంపిణీ చేసేలా పర్యవేక్షణ జరపాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ను మంత్రి ఆదేశించారు. వృద్దులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఎంతో గౌరవంగా బతకాలనే ఆలోచనతో ఆసరా పెన్షన్ క్రింద హైదరాబాద్ జిల్లా పరిధిలో 2.76 లక్షల మంది లబ్దిదారులకు ప్రతినెల 67 కోట్ల రూపాయల ఆర్ధిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు నుండి 57 సంవత్సరాలు దాటిన వారికి కూడా నూతనంగా పెన్షన్ లను ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ఆదేశాల మేరకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పెన్షన్ కు అర్హులైన లబ్దిదారులు అందరికి గుర్తింపు కార్డులను



పూర్తిస్థాయిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్దిదారులు దరఖాస్తులలో పేర్కొన్న అడ్రస్ లలో ప్రస్తుతం ఉండటం లేదని అధికారులు పేర్కొనగా, అవసరమైతే ఆయా నియోజకవర్గాల ఓఎం ల సహకారం తీసుకోవాలని చెప్పారు. పెన్షన్ ల కోసం వచ్చి పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలు అందజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి మంజూరుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఎంతో పేదరికంలో ఉన్న దళితులను ఆర్ధికంగా వృద్ధిలోకి తీసుకురావాలనే గొప్ప లక్ష్యంతో దళితబంధు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని వివరించారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 100 మంది చొప్పున హైదరాబాద్ జిల్లా లోని 15 నియోజకవర్గాలలో మొత్తం 1484 మంది ని గుర్తించి ఒకొక్కరికి 10 లక్షల రూపాయల వ్యయంతో వివిధ యూనిట్లను అందజేయడం జరిగిందని వివరించారు. ఈ యూనిట్లు అన్ని సక్రమంగా పని చేస్తున్నాయా? లేదా? పరిశీలించాల్సిన బాధ్యత ౹ఖఅ కార్పొరేషన్ అధికారులపైనే ఉన్నదని మంత్రి స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారిగా నియమించబడిన దళిత బంధు స్పెషల్ ఆఫీసర్ లు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్దిదారుల వివరాలు, యూనిట్ల సమాచారం తో కూడిన వీడియో, ఫోటో లతో కూడిన నివేదికలను సిద్దం చేసి ఆయా ఓఎం లకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. రెండో విడత దళితబందు అమలుకు సంబంధించి ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నదని తెలిపారు. అదేవిధంగా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనే వారికి ప్రభుత్వం 3 లక్షల రూపాయలు చొప్పున ఆర్ధిక సహాయం అందించేందుకు గృహ లక్ష్మి అనేక గొప్ప ఒక కార్యక్రమాన్ని తీసుకొస్తుందని తెలిపారు. త్వరలోనే పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు రానున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఓఎఅ లు ఓూ ప్రభాకర్ రావు, సురభి వాణిదేవి, స్టీఫెన్ సన్, ఓఎం లు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బలాల,ముంతాజ్ అహ్మద్ ఖాన్, కలెక్టర్ అమయ్ కుమార్, సికింద్రాబాద్, హైదరాబాద్ ఖీఊ లు వసంత, వెంకటేశ్వర్లు, ౹ఖఅ కార్పోరేషన్ ఇఒ రమేష్, వివిధ మండలాల తహసిల్దార్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 10న కృష్ణా బోర్డు సమావేశం

**హైదరాబాద్ :**

కృష్ణా నదీ జలాల్లో వాటాల పంపకాలపై ఈనెల 10వ తేదీన సమావేశం జరగనుంది. తెలంగాణ గతేడాది నుంచి పట్టుబడుతున్న కృష్ణా జలాల్లో చెరి 50 శాతం చొప్పున నీటి పంపిణీ చేయాలన్న అంశాన్ని ఎజెండాలో చేర్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ లేవనెత్తుతున్న అభ్యంతరాలు కూడా చర్చకు రాబోతున్నాయి. 2022-23 వాటర్ ఇయర్ లో నీటి పంపకాలు చేయకుండానే పూర్తి కానిచ్చిన నదీ యాజమాన్య బోర్డు ఈసారి రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ అధికారులకు సమావేశ ఎజెండాను పంపించింది. ఇప్పటి వరకు ఉన్న 66:34 నీటి పంపకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. గతేడాది మే 6వ తేదీన జరిగిన సమావేశంలో తెలంగాణ అధికారులు మొదట చెరిసగం నీటి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసినా, చివరలో బోర్డు ఛైర్మన్ విచక్షణకే వదిలేశారు. దీంతో తెలంగాణ అధికారులపై సీఎం కేసీఆర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈసారి ఎట్టి పరిస్థితుల్లో అయినా సమావేశంలో గట్టిగా పట్టుబట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తాగునీటికి కేవలం 20 శాతం మాత్రమే కేటాయించాలని తెలంగాణ కోరుతోంది. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటరీతోపాటు పలు ప్రాంతాల్లో సెన్సార్ ఆధారిత రియల్ టైమ్ డేటా అక్విజేషన్ సిస్టమ్ కూడా ఈసారి బోర్డు ఎజెండాలో చేర్చారు. ఆర్డీఎస్ ఆధునీకరణ, కుడి కాలువ పనుల నిలిపివేత కోసం తెలంగాణ చేసిన విజ్ఞప్తిని సమావేశంలో చర్చకు పెట్టారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలనే అంశం కూడా ఈసారి సమావేశంలో ముఖ్యాంశం కానుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ లో అవసరం లేకున్నా తెలంగాణ జల విద్యుత్ ఉత్పాదన చేస్తుందన్న ఏపీ అభ్యంతరాలు, రిజర్వాయర్ మేనేజ్ మెంట్ కమిటీ(ఆర్ఎంసీ) సిఫార్సుల అమలుపై కూడా చర్చించనున్నారు. జల విద్యుత్ ఉత్పాదన, రూల్ కర్వ్ మిగులు జలాల నిర్ధారమ వంటి అంశాలపై కూడా చర్చించబోతున్నారు. అంతే కాకుండా పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటి కేటాయింపులు చేస్తూ తెలంగాణ సమర్పించిన డీపీఆర్ తో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం తెలంగామ రూ.1450 కోట్లతో నిర్మిస్తున్న సుంకిశాల ఇంటెక్ వెల్ ప్రాజెక్టు నిర్మాణంపై ఏపీ అభ్యంతరాలు కూడా చర్చకు రానున్నాయి. నూతనంగా నియమితులైన కృష్ణా రివర్ బోర్డు కమిటీ సభ్యుడు, అధికారులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు. కృష్ణా బోర్డు సభ్యులు అజయ్ కుమార్ గుప్తాతో పాటు కేఆర్ఎంబీ ఎస్సీ అశోక్ కుమార్ ఈఈ శంకరయ్యలు డ్యామ్ ను పరిశీలించి... జలాశయానికి సంబంధించిన ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను డ్యామ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలాశయానికి సంబంధించిన గేట్స్, గ్యాలరీ, రోప్స్ ను పరిశీలించి వాటి పనితీరు తదితర వివరాలను గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. డ్యామ్ ను పరిశీలించిన అనంతరం ఏపీ కుడిగట్టు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి జెన్ కో అధికారులతో కాసేపు ముచ్చటించారు. అన్ని వివరాలు అడుగుతూ చాలా సేపు చర్చించారు. పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాం నీటి నిల్వలు ఆంధ్ర, తెలంగాణ నీటి వాటలాపై అధికారులతో చర్చించమని సూచించారు. జలాశయంలోని అడుగు భాగంలో ఉన్న గ్యాలరీ డ్యాం గేట్లుకు ఉన్న రోప్ లను.. స్పిల్ వే వాటి పటిష్ఠతపై డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నామన్నారు.

# యువ ఓట్లపై కాంగ్రెస్ గురి

**హైదరాబాద్**

రంగల్‌లో నిర్వహించిన సభలో రాహుల్ గాంధీతో రైతు డిక్లరేషన్ ప్రకటింప చేసిన టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రియాంకా గాంధీతో యూత్ డిక్లరేషన్ ప్రకటించేందుకు సన్నాహాలు చేశారు. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా 8వ తేదీన నిర్వహించ నున్న సభకు ''యువ సంఘర్షణ సభ''గా నామకరణం చేశారు. తమ ప్రభుత్వం వస్తే ఏం చేయాలనుకుంటున్నామో.. ముఖ్యంగా యూత్‌ను ఎలా ఆదుకుంటామో ప్రియాంకాగాంధీతో ప్రకటింప చేయనున్నరా.విద్యా ర్థులు, నిరుద్యోగులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వారిని ఆదుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ చెబుతోంది. ఎలా ఆదుకుం టామో యూత్ డిక్లరేషన్‌లో పొందుపరచనున్నారు. యూపీఎస్సీ తరహాలో ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇవ్వనుంది. తెలంగాణలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా.. వాటిని భర్తీ చేయడం లేదని..తాము రాగానే భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని విద్యార్థి, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికి మద్ధతుగా ఉంటుందని చెప్పేలా సభ నిర్వహించడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో 8న నిర్వహించే 'యువ సంఘర్షణ సభ' విజయవంతం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. యువ సంఘర్షణ సభ విజయంతం కోసం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీతో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయులతోనూ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రేలు సమావేశం నిర్వహించి.. జన సమీకరణలో ప్రతి నాయకుడు భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. యువ సంఘర్షణ సభను విజయవంతం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఏడు పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జులను నియమించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, భువనగిరి, మల్కాజ్‌గిరి, మెదక్, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌తో పాటు నల్లగొండ పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలోని అసెంబ్లిట నియోజక వర్గాల నుంచి జన సమీకరణ ఎక్కువగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ సభ విజయవంతం అయితే కాంగ్రెస్ హైకమాండ్ వద్ద రేవంత్ రెడ్డి పలుకుబడి మరింత పెరుగుతుంది. ఇప్పటికే సీనియర్లు ఆయన ప్రభావాన్ని వీలైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డి పాదయాత్రకు పోటీగా భట్టి విక్రమార్క కూడా పాదయాత్ర చేశారు. త్వరలో రేవంత్ రెడ్డి రెండో విడత పాదయాత్ర చేయాలనుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ బహిరంగసభను సక్సెస్ చేయడం ద్వారా రేవంత్ హైకమాండ్ వద్ద తన ప్రాధాన్యతను కొనసాగేలా చూసుకోవాలనుకుంటున్నారు.

# భూములు కోల్పోయిన వారికి సత్వరమే భూ పంపిణి చేపట్టాలి

**బద్వేలు**

పరిశ్రమ ఏర్పాటు తొ భూములు కోల్పోయిన తమకు సత్వరమే భూ పంపిణి కార్యక్రమం చేపట్టాలని గోపవరం ప్రాజెక్ట్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.ఈ మేరకు స్థానిక కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఇండో జర్మని గోపవరం కో ఆపరేటివ్ జాయింట్ పార్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో1972లో200మంది ఎస్సి ఎస్టీ లకు 5 ఎకరాల చొప్పున వంద సంవత్సరాల లీజు పద్ధతిన భూములను పంపిణి చేశారన్నారు. ఈ నేపధ్యంలో ప్రభుత్వం తమ భూములను పరిశ్రమ నిర్మాణానికై ప్లేవుడ్ పరిశ్రమకు అప్పగించిందన్నారు. ఈ క్రమంలోసొసైటీ సభ్యులైన 200మందితోపాటు నాన్



సభ్యులు మరో 65 మందికి 2.5ఎకరాల భూమిని పంపిణి చేసేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమకు ఒప్పంద పత్రం అందచేశారన్నారు. ఇందులో భాగంగా265 మంది సభ్యులకు గాను ఇంకా 85 మందికి పైగా భూములు కోల్పోయిన సభ్యలకు ఇంతవరకు భూ పంపిణి చేయక పోవడం బాధాకం మన్నారు. పరిశ్రమ పనులు చకచకా జరుగుతున్నాయే కాని తమకు మాత్రం భూ పంపిణి కావడం లేదంటూ వారు వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్, బద్వేలు ఆర్డీవోలకు విన్నవించినప్పటికి ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యలను పరిష్కరించి భూ పంపిణి కార్యక్రమం చేపట్టకపోతే భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పరిశ్రమ నిర్మాణ పనులను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సొసైటీ మాజీ సభ్యులు ఈశ్వరయ్య, పాలెం పెద్ద వెంకటరత్నం,పాలెం నారాయణ, వెంకటయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

# 13న ఇంటర్ ఫలితాలు...

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల వెల్లడికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 13వ తేదీ లోగా రిజల్ట్స్ ప్రకటించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఇందుకు సంబంధించిన పనులను వేగవంతం చేస్తున్నారు. మూల్యాంకనం తర్వాత మార్కుల క్రోడీకరణ, డీ కోడింగ్ ప్రక్రియను త్వరగా ముగించారు. ఇప్పటికే పలు దఫాలుగా ట్రయల్ రన్ చేశారు. ఈ సందర్భంగా వచ్చిన సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. ఈ ప్రక్రియలో గత రెండు రోజులుగా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని, దీన్నిబట్టి ఫలితాల వెల్లడికి ఎలాంటి ఇబ్బంది లేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఫలితాల విడుదల తేదీ ఖరారు కాకున్నా, ఈనెల 13వ తేదీలోగా కచ్చితంగా వెల్లడిస్తామన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలనే.. ఫలు దఫాలుగా ఫలితాల విశ్లేషణ, క్రోడీకరణ, కోడింగ్, విదాధాన్ని పరిశీలిస్తామని ఇంటర్ బోర్డు ముఖ్య అధికారి చెప్పారు. ఫలితాల వెల్లడికి సంబంధించిన పనులను ఏప్రిల్ 8వ తేదీలోపూ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు బోర్డు సిబ్బందిని ఆదేశించినట్లు తెలుస్తోంది. మంగళవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఇంటర్ అధికారులు కలిసే అవకాశం ఉందని సమాచారం. అదే రోజు పరీక్షల ఫలితాల వెల్లడి సమాచారాన్ని తెలియజేస్తారు. మంత్రి అనుమతి తర్వాత ఫలితాల వెల్లడి తేదీని ఖారారు చేయబోతున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది ఎగ్జామ్స్ రాశారు. సెకండ్ ఇయర్ వాళ్లు 4,65,022 మంది. మొత్తం 9,47,699 మంది స్టూడెంట్స్ పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రంలో 1,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు ఇంటర్ బోర్డు అధికారులు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఎయిడెడ్ కాలేజీలు కలుపుకుని 614, ప్రయివేటు జూనియర్ కాలేజీలు 859 ఉన్నాయి. 1,473 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,473 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు , 26,333 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఇంటర్ బోర్డు నియమించి ప్రశాంతంగా పరీక్షలను నిర్వహించింది

ప్రజాతపన
prajathapana.com

# వరుస సినిమాలతో శ్రీ లీల బిజీ



కన్నడ ముద్దుగుమ్మ శ్రీలీల తెలుగు సినిమా పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించిన 'పెళ్లి సందఆ' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టిన ఈ అమ్మడు, 'ధమాకా' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఆమె నటన, డ్యాన్స్ కు ప్రేక్షకులతో పాటు మేకర్స్ సైత్ ఫిదా అయ్యారు. ఆ తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. ఇప్పటికే 9 సినిమాలకు సైన్ చేసింది. ఇవన్నీ బడా ప్రాజెక్టులే కావడం విశేషం. మరికొన్ని సినిమాలు క్యూలో ఉన్నాయి. తాజాగా శ్రీ లీలకు మరో అదిరిపోకే ఛాన్స్ దక్కినట్లు తెలుస్తోంది. ఏకంగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సినిమాలోనే అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' తర్వాత, తన కూతురు సుస్మిత బ్యానర్ లో ఒక సినిమా చేసేందుకు రెడీ అవుతున్నారు. ఈ చిత్రానికి 'సోగ్గాడే చిన్ని నాయన' సినిమా డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో చిరంజీవితో పాటు డీజే టిల్లు హీరో జొన్నలగడ్డ సిద్ధు కూడా నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో శ్రీలీల సిద్ధుకు జోడీగా నటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే, శ్రీ లీల ఈ ఆఫర్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. నిజానికి 'టిల్లు స్క్వేర్' సినిమాలో హీరోయిన్ గా శ్రీ లీలని తీసుకోవాలని అనుకున్నారు. కానీ, కారణాలు బయటకు తెలియకపోయినా, తనను కాదని అనుపమ పరమేశ్వరన్ కు ఛాన్స్ ఇచ్చారు. ఎలాగైతేనేం, శ్రీ లీలతో కలిసి సిద్ధు స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడు. అదీ మెగాస్టార్ చిరంజీవి సినిమాలో. అటు శ్రీలీల సైతం చిరంజీవి సినిమాలో అవకాశం రావడం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, మహేష్ బాబు, పవన్ కల్యాణ్, రామ్ పోతినేని, నవీన్ పొలిశెట్టి, పంజా వైష్ణవ్ తేజ్ సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తోంది. ఇంకా శ్రీలీల కోసం వెయిట్ చేస్తున్న సినిమాలు నాలుగైదు దాకా ఉన్నాయి. మరికొన్ని అగ్రిమెంట్ కావల్సి ఉంది. ప్రస్తుతం శ్రీలీల అంగీకరించిన సినిమాలన్నీ షూటింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆమె కాల్ షీట్స్ ఖాళీగా లేవు. మొత్తంగా ఒక్కటే శ్రీలీల.. తొమ్మిది బడా సినిమాలు. స్టార్ హీరోలకు కూడా లేనన్ని పెద్ద ప్రాజెక్టుల్లో బిజీ బిజీగా గడుపుతోంది. ఈ తొమ్మిది సినిమాల్లో కనీసం 5 హిట్లు కొట్టినా, శ్రీలీలా టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా మారిపోవడం ఖాయం.










Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950